# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :263 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది:బుధవారం 31-12-2025 | పేజీలు:4 వెల: 2.00


## ఎపిలో మందుబాబులకు శుభవార్త

అమరావతి,నూతన సంవత్సరం వేడుకల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మద్యం విక్రయాలు, సేవల సమయాలను పొడిగించేందుకు ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి అనుమతి మంజూరు చేశారు. ఎక్సైజ్, ప్రొహిబిషన్ డైరెక్టర్ సమర్పించిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రత్యేక అనుమతుల ప్రకారం.. డిసెంబర్ 31 మరియు జనవరి 1 రాత్రుల్లో మద్యం దుకాణాలు అర్ధరాత్రి 12 గంటల వరకు విక్రయించవచ్చు. అలాగే బార్లు, (ఇన్-హౌస్) లైసెన్సులు కలిగిన ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంస్థలకు రాత్రి 1 గంట వరకు మద్యం విక్రయాలు, సర్వీస్‌కు అనుమతి ఇచ్చారు. గత ఏడాది నూతన సంవత్సరం సందర్భంగా అమలు చేసిన విధానాన్నే ఈ ఏడాదీ కొనసాగిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం, అక్రమ మద్యం విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల అమలుకు ఎక్సైజ్, ప్రొహిబిషన్ డైరెక్టర్, ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్లు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం పేర్కొంది.

## పగలు వదిలేసి రాత్రి వేళల్లో కీలక నిర్ణయాలేంది రేవంత్?



హైదరాబాద్,తెలంగాణ లోని రేవంత్ సర్కారులో ఒక విచిత్ర లక్షణం కనిపిస్తుంటుంది. ప్రభుత్వ పరంగా తీసుకునే అత్యంత కీలక నిర్ణయాలు.. వాటికి సంబంధించి సమాచారం రాత్రి వేళ.. అది లేట్ నైట్ వెలువటం ఈ మధ్యన ఎక్కువైంది. ఆ మాట కంటే కూడా అదో అలవాటుగా మారిందని చెప్పటం సబబుగా ఉంటుందని చెప్పాలి. సాధారణంగా ప్రభుత్వం తీసుకునే కీలక నిర్ణయాలకు సంబంధించిన వివరాల్ని వెల్లడించేందుకు పగలుపూటే ప్రకటిస్తుంటారు. అందుకు భిన్నంగా రేవంత్ సర్కారు మాత్రం రాత్రి వేళలో.. వరుస పెట్టి ప్రకటిస్తున్న వైనం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.డిసెంబరు 29 (సోమవారం) సంగతే తీసుకుంటే.. కేవలం రెండు గంటల వ్యవధిలో ఆ మాటకు వస్తే గంటన్నర వ్యవధిలో వెలువరించిన నిర్ణయాల్ని చూస్తే.. ఇంతటి కీలక నిర్ణయాల్ని ఇలా రాత్రి వేళలో ప్రకటించటమా? అన్న భావన కలుగక మానదు. ఒకట్రెండు అయితే ఫర్లేదు. ఏకంగా ఐదారు కీలక నిర్ణయాల్ని ఒకటి తర్వాత ఒకటి చొప్పున బ్యాక్ టు బ్యాక్ వెల్లడించిన వైనం చూసినప్పుడు.. రేవంత్ సర్కారు నైట్ వేళ ఉన్నంత యాక్టివ్ గా పగలు కూడా ఉంటే ఎంత బాగుండన్న భావన కలుగక మానదు.సోమవారం రాత్రి ఎనిమిది గంటల వరకు.. ఆ మాటకు వస్తే ఎనిమిదన్నర వరకు ఎలాంటి కీలక నిర్ణయాలకు సంబంధించిన ప్రకటనలు లేవు. తొమ్మిది తర్వాత నుంచి వెల్లడైన నిర్ణయాలు అందరి అటెన్షన్ తీసుకునేలా చేసిందని చెప్పాలి. కీలకమైన పాలనాపరమైన నిర్ణయాల్లో భాగంగా సీనియర్ ఐపీఎస్ అధికారుల బదిలీ అంశం ఒకటి. దీనికి మించి ఇప్పటివరకు హైదరాబాద్ మహానగర పరిధిలో మూడు పోలీస్ కమిషనరేట్ లు ఉండేవి. అది కాస్తా.. ఇప్పుడు నాలుగోది చేరింది. సీఎం రేవంత్ కలల పంటగా చెప్పే ఫ్యూచర్ సిటీకి సంబంధించి.. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ఏర్పాటు నిర్ణయాన్ని అధికారికంగా వెల్లడించారు.అంతేకాదు.. ఇప్పటి వరకు రాచకొండ సీపీగా వ్యవహరించిన సుధీర్ బాబు ఫ్యూచర్ సిటీ సీపీగా నియమితులైతే.. ఇంతకాలం సైబరాబాద్ సీపీగా ఉన్న అవినాశ్ మహంతి.. రాచకొండ ను పునర్ వ్యవస్థీకరించి దానికి మల్కాజ్ గిరి కమిషనరేట్ గా ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సీపీగా అవినాశ్ మహంతిని నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ కమిషనరేట్ సీపీగా సజ్జన్నార్ ను కొనసాగిస్తున్నారు. సైబరాబాద్ కమిషనరేట్ కు సీపీగా డాక్టర్ రమేశ్ ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన ప్రొవిజనింగ్ అండ్ లాజిస్టిక్స్ ఐజీపీగా వ్యవహరిస్తున్నారు.ఇప్పటి వరకు ఉన్న రాచకొండగా ఉన్న కమిషనరేట్ ప్రాంతంలోని కొంత భాగంలో ఉన్న యాదాద్రి భువనగిరి ప్రాంతాన్ని ప్రత్యేక పోలీస్ యూనిట్ గా ఏర్పాటు చేయటమే కాదు.. ఆ జిల్లాకు ప్రత్యేకంగా ఎస్పీని కేటాయించనున్నారు. ఇలా ఐపీఎస్ బదిలీలతో పాటు.. కీలక కమిషనరేట్ పరిధికి సంబంధించిన కీలక ప్రకటనను జారీ చేసింది.మరో వైపు.. జెడ్పీటీసీలు.. ఎంపీటీసీల ఎన్నికలకు ప్రభుత్వం ప్రకటన చేస్తుందని అందరూ ఆశిస్తుంటే.. అందుకు భిన్నంగా హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని మిగిలిన మున్సిపాలిటీలకు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కీలక ప్రకటనను జారీ చేసింది. నేటి నుంచి (మంగళవారం) వార్డుల విభజన ఏర్పాటుచేస్తామని..జనవరి 10 నాటికి ఓటర్ల తుది జాబితా సిద్ధం చేయనున్నట్లుగా ప్రకటించారు. ఇలా పాలనకు సంబంధించిన కీలక నిర్ణయాలు బాగా పొద్దుపోయిన తర్వాత ప్రభుత్వం ప్రకటించటం గమనార్హం.

## వైకుంఠ ఏకాదశి సందర్భంగా.. ఆలయాలకు పోటెత్తిన భక్తులు





హైదరాబాద్, వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెలుగు రాష్ట్రాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచే భక్తులు వైష్ణవ ఆలయాలకు తరలివెళ్లి.. ఉత్తర ద్వార దర్శనాలు చేసుకుంటున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలో తెల్లవారుజామునే ఉత్తర ద్వారాన్ని తెరిచారు. దీంతో భక్తులు పెద్ద ఎత్తున శ్రీవారిని దర్శించుకుంటున్నారు. వేములవాడలో రాజన్న ఆలయానికి అనుబంధంగా ఉన్న భీమన్న గుడిలో ఉత్తర ద్వార దర్శనాలు నిర్వహించారు. .తెలంగాణలో యాదగిరిగుట్టలో ఉదయం 5.40 నిమిషాల నుంచి ఉత్తర గోపురం ద్వారా లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి అనుమతిస్తున్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలోనూ ఘనంగా వైకుంఠ ద్వార దర్శనం ప్రారంభమైంది. గరుడ వాహనంపై శ్రీరామచంద్రస్వామి, గజవాహనంపై సీతమ్మ, హనుమత్ వాహనంపై లక్ష్మణుడు దర్శనమిచ్చారు.వైకుంఠ ఏకాదశి సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కొండగట్టు శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో తెల్లవారుజాము నుంచే ఉత్తర ద్వార దర్శనానికి అనుమతిస్తుండటంతో భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. కామారెడ్డి జిల్లాలో శ్రీ వేంకటేశ్వర స్వామి, వేణుగోపాల స్వామి ఆలయంలోనూ వైకుంఠ ద్వార దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు.

## తీవ్ర ఆవేదన చెందా.. పుతిన్ నివాసంపై దాడిని ఖండించిన మోడీ



న్యూఢిల్లీ,రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి చిగురిస్తున్న వేళ పుతిన్ నివాసంపై డ్రోన్ దాడులు తీవ్ర కలకలం రేపాయి. సోమవారం అర్ధరాత్రి పుతిన్ నివాసంపై డ్రోన్ దాడులు జరిగాయి.ఉక్రెయిన్ డ్రోన్ దాడులకు పాల్పడిందని రష్యా ఆరోపించింది. రష్యా రక్షణ వ్యవస్థలు 91 దీర్ఘశ్రేణి డ్రోన్లను అడ్డుకుని ధ్వంసం చేశాయని, ఎలాంటి ప్రాణ నష్టం లేదా ఆస్తి నష్టం జరగలేదని తెలిపింది. అయితే ఈ ఆరోపణలను ఉక్రెయిన్ ఖండించింది. శాంతి ఒప్పందాన్ని అడ్డుకునేందుకు రష్యా అబద్ధాలు చెబుతోందని అధ్యక్షుడు జెలెన్స్కీ ఆరోపించారు.

మోడీ ఖండన..

పుతిన్ నివాసంపై దాడిని ప్రధాని మోడీ ఖండించారు. డ్రోన్ దాడుల వార్తలు తెలియగానే 'తీవ్ర ఆందోళన' చెందినట్లుగా తెలిపారు. ప్రపంచ నాయకులు సంయమనం పాటించాలని.. శాంతి కోసం దౌత్య ప్రయత్నాలపై దృష్టి పెట్టాలని కోరారు.

ట్రంప్..

ఇదే విషయంపై ట్రంప్ కూడా స్పందించారు. పుతిన్ నివాసంపై దాడి వార్తలు తెలియగానే పుతిన్‌కు ట్రంప్ ఫోన్ చేసి విషయాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. ఇలా జరగడం మంచిది కాదన్నారు. రెండు దేశాల మధ్య శాంతి నెలకొల్పడానికి ప్రయత్నిస్తుండగా ఇలా జరగడం భావ్యం కాదన్నారు. పుతిన్ నుంచి విషయం తెలుసుకోగానే.. చాలా కోపంగా ఉన్నట్లు చెప్పారు.

షెహబాజ్ షరీఫ్

ఇక పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా పుతిన్ నివాసంపై దాడిని ఖండించారు. శాంతి భద్రతలకు ముప్పు కలిగించే అన్ని రకాల హింసలను పాకిస్థాన్ తిరస్కరిస్తుందని వ్యాఖ్యానించారు. ఇటువంటి హేయమైన చర్య శాంతి, భద్రతకు తీవ్ర ముప్పు కలిగిస్తుందని చెప్పారు. రష్యా ప్రభుత్వానికి, ప్రజలకు పాకిస్థాన్ సంఘీభావాన్ని తెలిపింది.

## చొరబాట్లకు మమత మద్దతు: అమిత్ షా



కోల్‌కతా: కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన విమర్శలతో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై విరుచుకుపడ్డారు. కోల్‌కతాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మమతా బెనర్జీ నేతృత్వంలోని గత 15 ఏళ్ల పాలనలో రాష్ట్రం అవినీతి, భయం, చొరబాట్లతో నిండిపోయిందని ఆరోపించారు.రాష్ట్ర భద్రతకు ఈ అంశాలు తీవ్ర ముప్పుగా పరిణమించాయని, రాబోయే అసెంబ్లీ ఎన్నికలు బెంగాల్ భవిష్యత్తుకు అత్యంత కీలకమని అమిత్‌షా అన్నారు.బంగ్లాదేశ్ సరిహద్దుల గుండా జరుగుతున్న చొరబాట్లపై షా ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఇది కేవలం రాష్ట్రానికే కాకుండా జాతీయ భద్రతకు సంబంధించిన విషయమని అన్నారు. మమతా బెనర్జీ తన రాజకీయ ప్రయోజనాల కోసం చొరబాట్లను ప్రోత్సహిస్తున్నారని, సరిహద్దుల వద్ద కంచె వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని అమిత్ షా పేర్కొన్నారు. కేవలం దేశభక్తి గల బీజేపీ ప్రభుత్వం మాత్రమే సరిహద్దులను కాపాడి, చొరబాటుదారులను బయటకు తరిమికొడుతుందని ఆయన అన్నారు.రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇక్కడి 'టోల్ సిండికేట్',అవినీతి కారణంగా ప్రజలకు చేరడం లేదని అమిత్ షా మండిపడ్డారు. బెంగాల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, భయం, దుర్పరిపాలన నుండి విముక్తి పొంది అభివృద్ధి దిశగా సాగాలని నిశ్చయించుకున్నారని అమిత్ షా అన్నారు. 2026, ఏప్రిల్‌లో జరగనున్న ఎన్నికల్లో ఓటర్లు తృణమూల్ ప్రభుత్వానికి చరమగీతం పాడనున్నారని ఆయన జోస్యం చెప్పారు.

## కుటుంబ సమేతంగా తిరుమలకు రేవంత్ రెడ్డి

తిరుమల,డిసెంబరు 30 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమలను సందర్శించారు. మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీవారిని రేవంత్ రెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. దేవాలయ అధికారులు రేవంత్ కుటుంబసభ్యులకు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న రేవంత్ కుటుంబం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భార్య, బిడ్డా అల్లుడు, మనవడితో కలసి ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నరు. అనంతరం వారికి పూజారులు శ్రీనివాసుడి తీర్థప్రసాదాలు అందజేశారు. మరోవైపు సాధారణ భక్తులు తిరుమలకు పోటెత్తారు. ఏకాదశి సందర్భంగా ద్వార దర్శనం కోసం భారీగా తిరుమలకు చేరుకున్నారు. తండోపతండాలుగా వస్తున్న భక్తులతో తిరుమల ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.భక్తుల తాకిడికి తగినట్లుగానే అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. భక్తులను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకల సౌకర్యాలూ కల్పించారు. పోలీసులు సైతం పటిష్ట బందోబస్తు నిర్వహించారు.



## కేటీఆర్‌కు అరెస్టు భయం?.. అందుకే అలా హింట్ ఇచ్చారా?





హైదరాబాద్,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొద్ది రోజులుగా ఆందోళనలో కనిపిస్తున్నారు. అందుకే ప్రెస్‌మీట్‌లోనూ సీఎం రేవంత్, అధికార పార్టీ నేతలపై విరుచుకుపడుతున్నట్టు తెలుస్తున్నది. తన తండ్రి జోలికి వస్తే ఊరుకునేది లేదని రెండ్రోజుల కిందట అధికార పార్టీ నేతలకు హెచ్చరికలు సైతం పంపారు. పైకి గాంభీర్యంగా కనపడుతున్న లోలోపల మాత్రం తనను ఎక్కడ అరెస్టు చేస్తారో అన్న ఆందోళన ఆయన్ను వెంటాడుతున్నదని రాష్ట్ర రాజకీయాల్లో చర్చ జరుగుతున్నది. ఇటీవల సర్పంచ్ ఎన్నికల్లో పార్టీని కేటీఆర్ ముందుండి నడిపించారు. ఆశించిన మేర ఫలితాలు రాకున్నా 30 నుంచి 40 శాతం వరకు సీట్లు సాధించి రెండో స్థానంలో పార్టీని నిలిపారు.

హడావుడి అందుకేనా?

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, మున్సిపల్, జీహెచ్ఎంసీ ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. 2026 ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు ఉంటాయని అధికార పార్టీ సైతం ఇప్పటికే హింట్ ఇచ్చింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇవాళ్టి నుంచి వార్డుల వారీగా మున్సిపల్ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సైతం చేపట్టింది. అందుకే ఆయన ఇటీవల జిల్లాల పర్యటనలు చేస్తున్నారు.ఇటీవల సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన వారిని సన్మానిస్తూనే అక్కడి కేడర్‌తో సంప్రదింపులు జరుపుతున్నారు. రానున్న ఎన్నికల కోసం సన్నద్ధం కావాలని హింట్ ఇస్తున్నారు. త్వరలోనే కేటీఆర్ జిల్లాల పర్యటన చేపడతారని కూడా గులాబీ పార్టీ హింట్ ఇచ్చింది.

వెంటాడుతున్న ఫార్ములా ఈ కార్ కేసు..

ప్రస్తుతం కేటీఆర్‌ను ఫార్ములా ఈ కార్ రేసు కేసు వెంటాడుతోంది.ఇప్పటికే విచారణ అధికారులు పలుమార్లు ఆయన్ను విచారించారు. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్న సమయంలో ఆయన ఆదేశాల మేరకు ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్.. ఫార్ములా ఈ కారు రేసును నగరంలో నిర్వహించారు.అందుకు రూ.50 కోట్ల హెచ్ఎండీఏ నిధులను విదేశీ కంపెనీకి బదిలీ చేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీకి అదే కంపెనీ నుంచి పార్టీ ఫండ్ వచ్చింది. ఇందులో మనీలాండరింగ్ జరిగిందని ఈడీ సైతం ఆరోపించింది. సిట్, ఈడీ అధికారుల విచారణ ఈ కేసులో కొనసాగుతోంది. ఇప్పటికే ఐఏఎస్ అరవింద్ కుమార్ .. కేటీఆర్ ఆదేశాల మేరకు నిధులు బదిలీ చేసినట్టు అంగీకరించారు. ఆయన్ను పూర్తి స్థాయిలో విచారిస్తే మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉంది. డీవోపీటీ నుంచి ఆదేశాలు రాగానే ఆయన్ను పూర్తి స్థాయిలో విచారించి ఈ కేసులో చర్యలు తీసుకోనున్నట్టు విచారణ అధికారులు తెలిపారు.

ముందే హింట్ ఇచ్చారా?

వచ్చేఏడాది మొదటి లేదా రెండో వారంలో డీవోపీటీ నుంచి ఐఏఎస్ అరవింద్ కుమార్ విచారణకు సంబంధించి ఆదేశాలు వస్తాయని విచారణ అధికారులు చెబుతున్నారు.తన ఆదేశాల మేరకే హెచ్ఎండీఏ నిధులను విదేశీ కంపెనీకి బదిలీ అయ్యాయని, ఏం చేస్తారు?మహా అయితే అరెస్టు చేస్తారా? చేసుకోండి అని ప్రభుత్వానికి కేటీఆర్ ఇప్పటికే సవాల్ విసిరారు. అరవింద్ కుమార్ విచారణ అనంతరం కేటీఆర్ అరెస్టు ఖాయం? అని ప్రచారం జరుగుతోంది. సరిగ్గా మున్సిపల్, జీహెచ్ఎంసీ ఎన్నికల ముందు ఆయన్ను అరెస్టు చేస్తే అటు ప్రజల్లోనూ ఆ పార్టీ పట్ల వ్యతిరేకత రావడం ఖాయంగా తెలుస్తున్నది.మరోవైపు నగరంలో కేటీఆర్‌కు మంచి పట్టుఉన్నది. ఆయన లోపల ఉంటే జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు భంగపాటు తప్పదు.ఈ విషయాన్ని ముందే గ్రహించిన కేటీఆర్.. నిన్న చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. 'నేను లోపల ఉంటే ఏం అవతుంది.. మున్సిపల్ ఎన్నికలను పార్టీ చూసుకుంటది' అని హింట్ ఇచ్చారు. ఆయన వ్యాఖ్యలతో ఆయన అరెస్టు తప్పదని అటు గులాబీ ఇటు కాంగ్రెస్ వర్గాల్లోనూ జోరుగా చర్చ జరుగుతున్నది.

### తిరుపతి ఆలయాల్లో భక్తుల రద్దీ

తిరుపతి, ఏపీ వ్యాప్తంగా పలు దేవాలయాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారాలు తెరుచుకున్నాయి. వేకువజామునే భక్తులు ఆలయాలకు తరలివచ్చి ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నారు. అటు తిరుమలలోనూ గత అర్ధరాత్రి నుంచే వైకుంఠ ద్వారాలు తెరుచుకోగా.. ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఇక తిరుపతిలోని శ్రీనివాస మంగాపురం శ్రీ కళ్యాణ వేంకటేశ్వర

## హైదరాబాద్-విజయవాడ హైవేపై 8వ తేదీ నుంచి వాహన రద్దీ



హైదరాబాద్, హైదరాబాద్ - విజయవాడ హైవేపై జనవరి 8 నుంచి వాహన రద్దీ ఎక్కువ ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు.సంక్రాంతి పండుగ సమయంలో నేషనల్ హైవేలపై ట్రాఫిక్ రద్దీ నివారణకు చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. సంక్రాంతికి వెళ్ళే వారికి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. గతేడాది ఎదురైనా అనుభవాల దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోజుకు సుమారు లక్ష వాహనాల ప్రయాణం సాగుతుందన్నారు. దీనిపై అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. తాను రేపు తూప్రాన్ పేట్, అబ్దుల్లాపూర్ మెట్ ప్రాంతాల్లో ఫీల్డ్ విజిట్ చేస్తామన్నారు.. మెయిన్‌గా ఎల్బీనగర్ నుంచి వనస్థలిపురం, పనామా గోడౌన్, హయత్ నగర్, రామోజీ ఫిల్మ్ సిటీ ఈ ప్రాంతాల్లో వేలాది వాహనాలు రద్దీ ఏర్పడుతుందని తెలిపారు. ఇక్కడ ఎట్టి పరిస్థితుల్లో ట్రాఫిక్ ఆగడానికి వీల్లేదు.. పండుగ రద్దీ ఉన్న రోజుల్లో లేన్‌లు మూసే పనులు, భారీ యంత్రాలతో చేసే పనులు చేయొద్దని మంత్రి సూచించారు.అత్యవసరంగా చేయాల్సిన పనులు ట్రాఫిక్ తక్కువగా ఉండే రాత్రి వేళల్లో మాత్రమే చేయాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. "పండుగ మొదలుకానున్న తేదీకి ముందే రోడ్లపై ఉన్న మట్టి, నిర్మాణ సామగ్రి, యంత్రాలు పూర్తిగా తొలగించాలి. అన్ని రహదారి లేన్‌లు వాహనాల రాకపోకలకు పూర్తిగా అందుబాటులో ఉంచాలి. రోడ్డు పనులు జరుగుతున్న ప్రతి చోట పగలు, రాత్రి స్పష్టంగా కనిపించే ట్రాఫిక్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. హై-విజిబిలిటీ కోన్లు, బారికేడ్లు ఏర్పాటు చేసి పనులు జరిగే ప్రాంతం, ట్రాఫిక్ వెళ్లే దారి స్పష్టంగా చూపాలి. ఎక్కడా ట్రాఫిక్‌కు అయోమయం కలిగించే ఏర్పాట్లు ఉండకూడదు. రద్దీ ఎక్కువగా ఉండే జంక్షన్లు, టోల్ ప్లాజాలు, కీలక ప్రాంతాల్లో అదనపు ట్రాఫిక్ పోలీసులను మోహరించాలి.. ట్రాఫిక్ మళ్లింపులు, నియంత్రణ అంశాల్లో స్థానిక ట్రాఫిక్ పోలీసులతో నిరంతరం సమన్వయం పాటించాలి." అని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## సంపాదకీయం

**బుధవారం 31-12-2025**

# కారడవులను కాపుగాసే ఏఐ...

దేశంలో ఎనిమిది కోట్లకుపైగా హెక్టార్లలో అడవులు విస్తరించాయి. జీవ వైవిధ్యానికి నిలయాలైన అరణ్యాలు... కర్బన నిల్వలు, వాతావరణ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయి. విస్తీర్ణం, సాంద్రత తగ్గడం, వనరుల దుర్వినియోగం, అగ్నిప్రమాదాలు, వాతావరణ మార్పులు వంటి తీవ్ర సవాళ్లను అడవులు ఎదుర్కొంటున్నాయి. సంప్రదాయ అటవీ నిర్వహణ పద్ధతులతో వీటిని అధిగమించడం కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో అటవీ సంరక్షణ, సమర్థ నిర్వహణలో కృత్రిమ మేధ(ఏఐ) ఆశాకిరణంగా కనిపిస్తోంది. ప్రస్తుతం అన్ని రంగాల్లో ఏఐ వినియోగం విస్తృతమవుతోంది. అటవీశాఖ పనితీరును మెరుగు పరచడంలోనూ ఇది బహుళ ప్రయోజనకారిగా పనిచేసే అవకాశం ఉంది. అటవీశాఖ దగ్గర దశాబ్దాల సమాచారం ఉంది. ఏఐతో దీన్ని విశ్లేషించడం ద్వారా వన్యప్రాణులు తరచూ సంచరించే ప్రదేశాలను ముందుగానే గుర్తించవచ్చు. టేకు, ఎర్రచందనం వంటి కలపనిచ్చే వృక్ష జాతులను విస్తరించిన ప్రాంతాల్లో ఏఐతో గట్టి నిఘా పెట్టడం, చెట్లు నరికే వ్యక్తులను సమూహాలను గుర్తించడం, మనుషులకు వన్యప్రాణులకు మధ్య జరిగే సంఘర్షణ ప్రదేశాలను గమనించడం, వాటిని నివారించడానికి తగిన చర్యలను తీసుకోవడం సాధ్యమవుతుంది. విస్తారమైన డేటాను విశ్లేషించడం, అంచనా నివేదికలను రూపొందించడం వంటి సామర్థ్యాలు కలిగిన ఏఐ- అడవుల నిర్వహణ, సంరక్షణలో ఆధునిక సాంకేతికత సాయాన్ని పొందే అవకాశాన్ని కల్పిస్తోంది. అటవీ పర్యవేక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ, వనరుల అక్రమ వినియోగాన్ని అరికట్టడం, వాతావరణ మార్పులను ముందుగానే గుర్తించడం, వాటిని ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించడం తదితర అంశాల్లోనూ ఏఐ వాడకం వేగంగా విస్తరిస్తోంది.

తక్షణ హెచ్చరికలకు...

అనేక ప్రాంతాల్లో విస్తరించిన అరణ్యాల్లో ఎక్కడో కొన్ని ప్రదేశాల్లో అటవీ ప్రాంతాల ఆక్రమణ, వనరుల దోపిడీ వంటివి జరుగుతూనే ఉంటాయి. అటువంటి ప్రదేశాలను కాలినడకన గస్తీ తిరిగే సిబ్బంది గుర్తించడంలో ఆలస్యం జరగవచ్చు. డ్రోన్లు, ఏఐ ఆధారిత పరికరాల ద్వారా వాటిని గుర్తించి, తక్షణమే సిబ్బంది అక్కడికి చేరుకుని నష్టాన్ని అరికట్టవచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో భూఆధారిత సమాచార వ్యవస్థ (జీఐఎస్) ఉపగ్రహ చిత్రాలను ఉపయోగిస్తూ అటవీ ప్రాంతాల్లో సంభవించే మార్పులను తరచూ అధ్యయనం చేస్తూ, వాటికిగల కారణాలను విశ్లేషించి, అటవీ నిర్వహణ తీరును మెరుగుపరిచే కృషి జరుగుతోంది. నాగార్జున సాగర్, అమ్రాబాద్, కవ్వాల్ వంటి పులుల సంరక్షణ కేంద్రాల్లో పులుల కదలికలు, పర్యవేక్షణకు ఎం-స్ట్రైప్స్ వ్యవస్థను ఉపయోగిస్తున్నారు. అగ్నిప్రమాదాలకు సంబంధించిన చారిత్రక డేటా, వాతావరణ పరిస్థితుల ఆధారంగా ప్రమాదం సంభవించడానికి అవకాశం ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించవచ్చు. ఈ క్రమంలో ఏఐ ఆధారిత పరికరాలు తక్షణ హెచ్చరికలను అందిస్తూ అగ్నిమాపక సిబ్బందికి సహాయ పడుతున్నాయి. దీనివల్ల విపత్తువేళ స్పందన సమయం 20-40శాతం తగ్గినట్లు వెల్లడైంది. శబ్ద పర్యవేక్షణ ద్వారా పక్షుల కిలకిలలు, పులుల గర్జనలు వంటి వాటిని ఏఐ సాంకేతికత విశ్లేషిస్తోంది. వివిధ జీవజాతులను గుర్తిస్తోంది. కెమెరా ట్రాప్స్ ద్వారా సేకరించిన లక్షల సంఖ్యలోని చిత్రాలను ఏఐ వర్గీకరిస్తూ మానవ శ్రమను తగ్గిస్తోంది. అస్సాం, కేరళలో ఏనుగుల విషయంలో వినియోగించిన ఏఐ ఆధారిత సాంకేతిక ఉపకరణాలు మానవ-జంతు ఘర్షణలను తగ్గించాయి.

వేటగాళ్లపై నిఘాకు...

అటవీ పరిరక్షణ, నిర్వహణలో ఏఐ సాంకేతికతను వాడే విషయంలో కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. స్థానిక జాతులు, నేల నాణ్యత, వన్యప్రాణుల కదలికలపై డేటా లభ్యత తక్కువగా ఉంటోంది. మౌలిక వసతుల లోపం, ఇంటర్నెట్, విద్యుత్ సౌకర్యం లేని ప్రాంతాల్లో ఏఐ ఉపకరణాలను వినియోగించడం కష్టమవుతుంది. ఏఐ పరికరాలు ఖరీదైనవి, పైగా సిబ్బంది శిక్షణకు అధిక వ్యయం అవుతుంది. ఇలాంటి సమస్యలను అధిగమించాల్సిన అవసరం ఉంది. ఏఐ ద్వారా నేల ఆరోగ్యం, కార్బన్ స్థాయిలు, వేటగాళ్ల కార్యకలాపాలను పర్యవేక్షించే స్మార్ట్ సెన్సర్లను అభివృద్ధి చేసుకోవాలి. జాతీయ హరిత మిషన్ కింద ఏఐ వినియోగానికి విధానపరమైన ప్రోత్సాహం అందించాలి. జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యం, గ్రామస్థులు, విద్యార్థులు మొబైల్ యాప్‌ల ద్వారా అక్రమ కార్యకలాపాలను ప్రభుత్వానికి నివేదించడం వంటి పనులు చేపట్టవచ్చు. అటవీ సంరక్షణలో సమర్థ పర్యవేక్షణ, తక్షణ చర్యలు మొదలు అంచనా, విశ్లేషణల దాకా ఏఐ కీలకపాత్ర పోషిస్తుంది. రాబోయే కాలంలో సవాళ్లను మరింత సమర్థంగా అధిగమిస్తూ అందరి సహకారంతో ముందుకు సాగితే- ఏఐ ఆధారిత అటవీ నిర్వహణలో భారత్ ప్రపంచానికే మార్గదర్శకంగా నిలుస్తుంది. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో అటవీ విభాగాలను ఆధునికీకరించడం, కొత్త సాంకేతికతను, పరికరాలను, మెలకువలను సమకూర్చడం అవసరం.

# కెసిఆర్ మాటలకు చింతకాయలు రాలేనా ?

హైదరాబాద్,మాటలకు చింతకాయలు రాలుతాయా అంటే..రాలుతయానే అంటారు మాజీ సిఎం కెసిఆర్. ఎందుకంటే ఆయన మాటలతోనే పదేళ్లపాటు ఓట్లు రాల్చుకున్నారు. ఇప్పుడు మళ్లీ అదే ప్రయోగానికి సిద్ధం అవుతు న్నారు. రెండేళ్లుగా ఫాంహౌజ్‌కే పరిమితమైన కేసీఆర్ ఇకపై తోలు తీయడానికి తానే స్వయంగా రంగం లోకి దిగబోతున్నట్టు ప్రకటించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఇంతకాలం విపక్షనేతగా ఆయన విఫలం అయ్యారు. తోలు తీయడానికి ముందు గత 9 ఏళ్ల పాపాల గురించి ప్రశ్నిస్తున్న వారికి సమాధానం చెప్పివుంటే హుందాగా ఉండేది. ధరణి,ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం అక్రమాలు, ఇ- కార్ రేసింగ్ తదిరఅ వినతి కేసులు చాలానే ఉన్నాయి. వీటికి సమాధానం చెప్పడం లేదు. పైగా కెసిఆర్ కొడుకు లొట్టపీసు కేసులని బెదిరింపులకు దిగారు. ఏతావాతా రాజకీయ నేతల భాష జుగప్సాకరంగా మారింది. ఉన్నట్టుండి తెలంగాణ రాజకీయాలలో తెలంగాణ సెంటిమెంటును రగిలించడానికి కేసీఆర్ ప్రయత్నించడం కేవలం రాజకీయంగా మళ్లీ పట్టు సాధించేందుకే తప్ప మరోటి కాదు. మళ్లీ నీళ్లు,నిధులు, నియామకాలు అంటూ నినదిస్తానని ప్రకటించినట్లు సమాచారం. తెలంగాణ ఏర్పడి పన్నెండేళ్ల తరవాత ఇంకా తెలంగాణ సెంటిమెంట్‌తో ఆడుకునే వారికి ప్రజలు గుణపాఠం చెప్పాలి. తెలంగాణపై బీఆర్ఎస్‌కు మాత్రమే పెటెంట్ ఉన్నట్లుగా బిఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారు. తమ హయాంలో పదేళ్ల మోసాలపై మాత్రం మాట్లాడడం లేదు. ఇదంతా కేవలం రాజకీయ డ్రామా అని మాత్రం ప్రజలకు కూడా తెలుసు. వరుస ఓటములతో బిఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. కంటోన్మెంట్,జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఓటమితో పాటు, పంచాయితీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఆధిక్యం చాటింది. దీంతో ఇక కెటిఆర్‌తో లాభం లేదనుకున్నాడేమో ..కెసిఆర్ స్వయంగా రంగంలోకి దిగుతానని ప్రకటించారు. గతకొంతకాలంగా బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ రావులు ఇదే ప్రకటిస్తూ వస్తున్నారు. మరోవైపు కూతురు కవిత జనంజాగృతి బాటతో బిఆర్ఎస్ నాటి పాలనా వైఫల్యాలను తూర్పారాబడుతున్నారు. ఆనాడు జరిగిన తప్పిదాలకు క్షమాపణలు కోరుతున్నారు. అభివృద్ధి, బంగారు తెలంగాణ పేరుతో జరిగిన ప్రచారమంతా డొల్ల అని ఆమె కళ్లముందే కనిపిస్తుంటే.. వలపోస్తున్నారు. ఇప్పటి వరకు ఎన్నికలు ఎప్పుడు జరిగినా తాము అధికారంలోకి వచ్చినట్టేనని భారత రాష్ట్ర సమితి నాయకులు కలలుకంటూ వచ్చారు. గత ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు కూడా రాలేదు. అధికార కోల్పోయాక జరిగిన తర్వాత వచ్చిన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం, సర్పంచ్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించడంతో సిఎం రేవంత్ రెడ్డి రెట్టించిన ఉత్సాహంతో కెసిఆర్‌పై విరుచుకు పడుతున్నారు. అసెంబ్లీకి రా తేల్చుకుందామని, చర్చిద్దామని సవాళ్లు విసరుతున్నారు. ఇప్పుడు కూడా మౌనంగా ఉంటే బాగండ దనో ఏమో కెసిఆర్ ..సై అంటూ సవాళ్లు విసిరారు. అందుకే కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను రేవంత్‌రెడ్డి వదులుకోవడానికి సిద్ధపడడం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం చేస్తున్నారని సరికొత్త వివాదాన్ని తెర మీదకు తెచ్చారు. చంద్రబాబుతో కుమ్మక్కయి రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాకు ద్రోహం చేస్తున్నారని కేసీఆర్ వాదన మొదలు పెట్టారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు రాజకీయంగా అవసరం వచ్చినప్పుడల్లా చంద్రబాబు బూచి చూపడం కెసిఆర్‌కు అలవాటుగా మారింది. 2018లో చంద్రబాబును



బూచిగా చూపించి బొడ్లో కత్తిపెటుటుకుని తిరుగుతున్నాడని ప్రచారం చేశారు. కేసీఆర్ ప్రచారం ఫలించి రెండవ పర్యాయం అధికారంలోకి వచ్చారు. 2023 ఎన్నికల్లో అది పనిచేయలేదు. దీంతో ఇప్పుడు నీళ్ల విషయంలో చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కలిసి తెలంగాణకు, ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం చేస్తున్నారని కొత్త పల్లవితో సభలు పెట్టేందుకు సిద్ధం అయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ వాసి అయినందున ఆయన తన సొంత జిల్లాకు అన్యాయం చేసుకుంటారని ఎవ్వరు కూడా అనుకోరు. చంద్రబాబుతో కుమ్మక్కు అవుతారనడానికి ఆధారాలు లేవు. ఏ రాజకీయ నాయకుడైనా సొంత ప్రాంత ప్రయోజనాలను పణంగా పెట్టి రాజకీయాలు చేస్తారని అనుకోవడానికి లేదు. అందులోనూ కెసిఆర్‌ను ఇక అధికారంలోకి రానివ్వనని శపథం కూడా చేశారు. పాలమూరు రంగారెడ్డిపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. అందుకేనేమో కెసిఆర్ కూడా ప్రస్తుతానికి ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకోవాలని చూస్తున్నారు. నీటి అంశాలపై ప్రజలు వెంటన స్పందిస్తారి అనుకుని ఉంటారు. ప్రజల్లో సెంటిమెంటును రగిలించడానికి ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో బహిరంగ సభలు పెట్టాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్టుగా కనిపిస్తోంది. ఉంది. తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించడానికి ఫ్యూచర్ సిటీలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైజింగ్ సమ్మిట్ నిర్వహించడాన్ని ఎగతాళి చేసారు. నిజానికి తాను ద్వేషించే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని జీర్ణించుకోలేకనే రెండేళ్లుగా ఫామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారు. అసెంబ్లీకి కూడా రాకుండా పోయారు. తన దృష్టిలో అల్పుడైన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం కెసిఆర్ సహా బిఆర్ఎస్ శ్రేణులకు ఇప్పటికీ మింగుడు పడడం లేదు. దీనికితోడు సొంతంగా వ్యూహాలతో కాంగ్రెస్‌కు బలం చేకూరుస్తున్నారు. రాజకీయంగా తాను చేసిన పొరపాట్లను సరిదిద్దుకోవడానికి కెసిఆర్ ఏనాడూ ప్రయత్నించలేదు.పొరపాట్లను గుర్తించి సరిదిద్దుకుంటారని అనుకుంటే అలా జరగడం లేదు. అందుకే ప్రజలను మోసం చేసి రేవంత్‌రెడ్డి అధికారం లోకి వచ్చారని ప్రచారం చేస్తున్నారు. ఉద్యమ సమయంలో ప్రజల్లో ఉండే భావోద్వేగాలు ఎల్లకాలం ఉంటాయని ఇంకా కేసీఆర్ నమ్ముతున్నారు. అందుకే కృష్ణాజలాల పేరుతో రాజకీయానికి పావులు కదుపుతున్నారు. రాజకీయాల్లో అతిశయంతో పనిచేస్తే ఓటమి తప్పదు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులగా విస్మరించారు. ఇప్పుడు ప్రజలకోసం అని బయలుదేరితే ప్రజలు నమ్ముతారని అనుకోవడం కెసిఆర్ మూర్ఖత్వమే అవుతుంది.

# తిరుమలలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు



తిరుమల, శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనానికి భారీగా ఏర్పాట్లు చేశారు. డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేది వరకు నిర్వహించనున్న ప్రతిష్టాత్మక వైకుంఠ ద్వార దర్శనాలకు విచ్చేసే భక్తులకు స్వామివారి దర్శనాన్ని దివ్య అనుభూతిగా మార్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీటీడీ అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరి అన్నారు. ఈసారి వైకుంఠ ద్వార దర్శనాలకు టోకెన్ల కేటాయింపులో విధానాత్మక మార్పులు తీసుకొచ్చినట్లు చెప్పారు. వైకుంఠ ద్వార దర్శన విధులకు వచ్చిన సిబ్బంది వ్యవస్థను పూర్తిగా అర్థం చేసుకుని సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని అధికారులతో అన్నారు. భక్తుల భద్రత, రద్దీ నిర్వహణకు ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అత్యాధునిక ఏఐ సాంకేతికత వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఈ సాంకేతికత ద్వార భక్తులు, వాహనాల రద్దీపై ప్రత్యక్ష పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. టీటీడీ, పోలీస్, విజిలెన్స్ విభాగాల నుండి ఐటీ నిపుణులు సమన్వయంతో పని చేస్తూ ఎప్పటికప్పుడు భక్తుల సమాచారాన్ని అప్డేట్ చేస్తూ వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 లోని ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల సెంటర్ లో ప్రదర్శించాలని చెప్పారు. భవిష్యత్తులో తిరుమలకు వచ్చే భక్తుల కోసం సమస్య రహిత వ్యవస్థను నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలియజేశారు. వైకుంఠ ద్వార దర్శనాలకు విచ్చేసే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విస్తృత ఏర్పాట్లు చేసినట్లు టీటీడీ అదనపు ఈవో శ్రీ సి. హెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. క్యూలైన్లలో ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయిలు, అన్న ప్రసాదం పంపిణీ, మరుగుదొడ్ల సౌకర్యాలను పరిశీలించి భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. వైకుంఠ ద్వార దర్శనాలు పురస్కరించుకుని చాలా వరకు ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశామని చెప్పారు. భక్తుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని క్యూలైన్లలో పలు మార్పులు చేపట్టామని తెలిపారు. క్యూలైన్లలో భక్తులు కూర్చునేవిధంగా ఏర్పాట్లు చేయడంతో పాటు, తాగునీటి సౌకర్యం, క్యూలైన్లకు అనుసంధానంగా అదనపు మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. చలికాలం కావడంతో క్యూలైన్లలోని అన్న ప్రసాదాల పంపిణీ కేంద్రాల్లో అన్న ప్రసాదాలు చల్లబడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకునే ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా భక్తులకు తాగునీరు అందించేందుకు అదనంగా మొబైల్ వాటర్ డ్రమ్స్, మూడు మొబైల్ ఫుడ్ వ్యాన్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భక్తుల కోసం టీటీడీ అందుబాటులో ఉంచిన సదుపాయాలను వినియోగించు కునేందుకు వివిధ భాషల్లో సూచిక బోర్డులను కూడా క్యూలైన్లలో మరియు ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరూ టీటీడీ క్యూలైన్లలో కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని సంయమనంతో స్వామివారిని దర్శించుకోవాలని తెలియజేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలను పురస్కరించుకుని విచ్చేసే భక్తుల రద్దీ దృష్ట్యా డిసెంబర్ 28 నుండి జనవరి 7వ తేది వరకు తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్ లో భక్తులకు ఇచ్చే ÷ూఆ టోకెన్ల జారీని రద్దు చేయడం జరిగింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించవలసిందిగా భక్తులకు టీటీడీ విజ్ఞప్తి చేయడమైనది. తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు. తొలి మూడు రోజులు అనగా, డిసెంబర్ 30, 31 మరియు జనవరి 01వ తేదీల్లో ఈ-డిప్ ద్వారా టోకెన్లు పొందిన భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం. టోకెన్ పొందిన భక్తులు తమకు కేటాయించిన తేదీలలో నిర్దేశిరచిన సమయానికి మాత్రమే తిరుమలలోని దర్శన ప్రవేశ మార్గాలకు చేరుకోవాల్సి ఉంటుంది. వైకుంఠ ఏకాదశి నుంచి పదిరోజుల పాటు తిరుమలలో భక్తులకు ఏ ఇబ్బందులూ రాకుండా పక్కాగా ఏర్పాట్లు చేసినట్లు తితిదే అదనపు ఈఓ వెంకయ్య చౌదరి వెల్లడించారు. తొలిరోజు ప్రొటోకాల్ దర్శనాలు ముగిసిన వెంటనే స్లాటెడ్ సర్వదర్శనం మొదలవుతుంది. సోమవారం అర్ధరాత్రి తర్వాత 1:30 నుంచి మంగళవారం రాత్రి 11:45 గంటల మధ్య.. 20 గంటల పాటు సామాన్యులకే అవకాశం కల్పిస్తాం. సుమారు 70వేల మందికి దర్శనం చేయించాలన్నది లక్ష్యం. ఏ రోజు టోకెన్ పొందితే, అదేరోజు దర్శనం చేయించేలా గంటలవారీగా లెక్కలు కట్టి అమలుచేస్తాం. ఇందుకోసం ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను వినియోగించనున్నాం. భక్తులు టోకెన్‌పై నిర్దేశిరచిన సమయానికి, సూచించిన ప్రదేశానికి రావాలి. వేచి ఉండే భక్తులకు పులిహోర, చక్కెర పొంగలి, దద్ధోజనం తదితర 16 రకాల ఆహార పదార్థాలు సిద్ధం చేస్తున్నాం. మొదటి మూడు రోజులు 24 గంటలూ అన్నప్రసాదాలు, వేడి పానీయాలు కాఫీ, టీ, బాదం పాలు, చిన్నపిల్లలకు పాలు సిద్ధంగా ఉంటాయి. నిత్యం 4.30 లక్షల లడ్డూలు అందుబాటులో ఉంచుతున్నాం. లడ్డూ కౌంటర్ల వద్ద రద్దీ తగ్గించేందుకు డిజిటల్ పేమెంట్ కియోస్కులు ఏర్పాటుచేశాం. నగదురహితంగా స్లిప్పులు పొంది నేరుగా లడ్డూలు తీసుకోవచ్చు. పూర్తిగా ఆటోమేటెడ్ సిస్టమ్‌లో గదులు కేటాయిస్తున్నాం. కొత్తగా అందుబాటులోకి వచ్చిన వెంకటాద్రి నిలయం (పీఏసీ -5)లో అద్భుత వసతులున్నాయి. భక్తులు గదుల కోసం వేచిచూడకుండా, ఇక్కడ స్నానాదులు ముగించుకుని తమ స్లాట్ ప్రకారం దర్శనానికి వెళ్తే మంచిదని సూచించారు.

## పోర్టు అథారిటీ డిప్యూటీ ఛైర్ పర్సన్‌గా రోష్నీ అపరాంజి

విశాఖపట్టణం, విశాఖపట్నం పోర్టు అథారిటీ డిప్యూటీ ఛైర్ పర్సన్‌గా మహిళా ఐఏఎస్ అధికారి రోష్ని అపరాంజి కోరాటి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ పోర్టులో ఈ పదవిని చేపట్టిన తొలి మహిళా ఐఏఎస్ అధికారి కావడం విశేషం. విశాఖ పోర్టు అథారిటీకి డిప్యూటీ ఛైర్‌పర్సన్‌గా నియమితులవడానికి ముందు డిప్యుటేషన్‌పై విశాఖ స్పెషల్ ఎకనామిక్ జోన్ లో జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. 2018లో ప్రజా పరిపాలనలో విశిష్ట సేవలకుగాను ప్రధాని అవార్డు సహా అనేక పురస్కారాలు అందుకున్నారు. అస్సాం-మేఘాలయ కేడర్‌కు చెందిన ఆమె తన విద్యాభ్యాసమంతా విశాఖలోనే పూర్తి చేశారు. ఆమె తండ్రి విశాఖపట్నం పోర్టు హై స్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించారు. తండ్రి సేవలు అందించిన సంస్థకు కుమార్తె డిప్యూటీ ఛైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించడం గమనార్హం. ఏప్రిల్ 3, 1984లో జన్మించిన రోష్ని.. ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్స్‌లో మాస్టర్స్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో ఆమెకు విస్తృత పరిపాలనా అనుభవం ఉంది. అస్సాంలోని జోర్హాట్ జిల్లాకు అదనపు ఉప కమిషనర్‌గా, అదే జిల్లాకు కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌గా సేవలందించారు. ■

# భావోద్వేగాలతో ఆడుకుంటే చర్యలు తప్పవు!

హైదరాబాద్, మీతో స్నేహితుడిలా మాట్లాడే, మీ భావోద్వేగాలను పంచుకునే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సేవలు ఈ మధ్యకాలంలో బాగా ప్రాచుర్యం పొందుతున్నాయి. అయితే, ఈ సాంకేతికత వెనుక ఉన్న నైతిక, భద్రతాపరమైన ప్రమాదాలపై చైనా ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. మనుషుల్లా నటించే, భావోద్వేగాలతో బంధం పెంచుకునే ఏఐ సేవలపై కఠినమైన నియంత్రణలు విధిస్తూ, అక్కడి సైబర్ రెగ్యులేటరీ అథారిటీ ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. అసలు చైనా ఎందుకింత కఠినంగా వ్యవహరిస్తోంది? ఈ కొత్త నిబంధనల వెనుక ఉన్న ఆంతర్యమేంటి?కృత్రిమ మేధ రంగంలో దూసుకుపోతున్న చైనా, దాని వినియోగంపై కూడా అంతే కఠినంగా వ్యవహరిస్తోంది. శనివారం, చైనా సైబర్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ , మానవ వ్యక్తిత్వాలను అనుకరించే ఏఐ సేవలపై కొత్త ముసాయిదా నిబంధనలను ప్రజల అభిప్రాయం కోసం విడుదల చేసింది. ఈ సేవలు వినియోగదారులతో మానసికంగా, భావోద్వేగపరంగా మమేకమయ్యే ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో, వాటిపై పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.కొత్త నిబంధనల లక్ష్యం.. 'డిజిటల్ కళ్లెం' : వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని వేగంగా విస్తరిస్తున్న ఏఐ రంగంలో భద్రత, నైతికతకు పెద్దపీట వేయడమే ఈ కొత్త నిబంధనల ప్రధాన లక్ష్యం. బీజింగ్ ప్రభుత్వం, ఈ రంగంపై తన పట్టును నిలుపుకుంటూ, దానిని సరైన మార్గంలో నడిపించాలని చూస్తోంది. ఈ ముసాయిదా నిబంధనలు, ఏఐ కంపెనీలకు ఓ 'డిజిటల్ కళ్లెం'లా పనిచేయనున్నాయి.ప్రభావం ఎలా ఉండనుంది? : ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే, ఏఐ సేవలను అందించే కంపెనీలు అనేక భద్రతా, నైతిక ప్రమాణాలను పాటించాల్సి ఉంటుంది. వినియోగదారుల మానసిక ఆరోగ్యానికి హాని కలిగించేలా ఏఐ సేవలు ఉండకూడదు. భావోద్వేగాలతో ఆడుకుని, వారిని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయకూడదు. వినియోగదారుల వ్యక్తిగత డేటా భద్రతకు పూర్తి బాధ్యత వహించాలి. ఈ నిబంధనలు, చైనాలో వినియోగదారుల-కేంద్రీకృత ఏఐ సేవల భవిష్యత్తును నిర్దేశించనున్నాయి. సాంకేతిక ఆవిష్కరణలకు, నైతిక బాధ్యతలకు మధ్య సమతుల్యతను సాధించే దిశగా చైనా వేస్తున్న ఈ అడుగు, ప్రపంచవ్యాప్తంగా ఏఐ నియంత్రణపై జరుగుతున్న చర్చపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

# సుదీర్ఘ విరామం తర్వాత పనులకు అధికారుల సన్నద్ధం

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రానికి కీలకమైన శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కాలువ టన్నెల్ ప్రాజెక్టులో మళ్లీ కదలిక మొదలైంది. ఫిబ్రవరి నెలలో ఇన్లెట్ వద్ద జరిగిన ప్రమాదం కారణంగా.. నెలల పాటు నిలిచిపోయిన టన్నెల్ తవ్వకాలను తిరిగి ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. సుదీర్ఘ విరామం అనంతరం పనులకు ముందడుగు పడటంతో ప్రాజెక్టుపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఈ ప్రాజెక్టులో 13.95 కిలోమీటర్ల వద్ద సొరంగం కూలిపోవడం పెద్ద సంచలనంగా మారింది. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని అధికారులు అత్యంత ప్రమాదకరమైన జోన్‌గా గుర్తించారు. ప్రమాదం చోటుచేసుకున్న ప్రదేశంలో ఉపరితలంపై నీటి ప్రవాహాలు అధికంగా ఉండటంతో పాటు, భూపలకల అమరిక కూడా క్లిష్టంగా ఉన్నట్లు ఎలక్ట్రో మాగ్నెటిక్ సర్వేలో వెల్లడైంది. దీంతో అక్కడ మళ్లీ నేరుగా తవ్వకాలు చేపట్టడం ప్రమాదకరమని నిపుణులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో టన్నెల్ పనులకు ప్రత్యేక నిపుణుల పర్యవేక్షణలో.. ముందుకు వెళ్లాలని అధికారులు నిర్ణయించారు. టన్నెల్ నిర్మాణాల్లో అనుభవం కలిగిన భారత ఆర్మీ సీనియర్ అధికారులు హెర్పాల్ సింగ్, పరీక్షిత్ మెహర పర్యవేక్షణలో తదుపరి పనులు చేపట్టనున్నారు. వీరి మార్గదర్శకత్వంలో భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేస్తూ పనులు సాగించాలని ప్రణాళిక రూపొందించారు. ప్రమాద స్థలం వద్ద షీర్ జోన్ ఉన్నట్లు గుర్తించడంతో, ఆ ప్రాంతాన్ని పూర్తిగా నిషేధితంగా ప్రకటించి మూసివేశారు. అక్కడ ఎలాంటి పనులు చేపట్టకూడదని అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులో మళ్లీ ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు భూగర్భ నిర్మాణాలపై లోతైన అధ్యయనం చేసి ముందుకెళ్లాలని నిర్ణయించారు. ప్రస్తుతం అధికారులు కొత్త మార్గం కోసం ఆలోచనలు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన 13.95 కిలోమీటర్ పాయింట్‌కు సుమారు 100 మీటర్ల వెనుక వైపు నుంచి మరో సురక్షిత మార్గం తవ్వేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ కొత్త మార్గాన్ని ప్రమాద ప్రాంతాన్ని దాటించి, ఆ తర్వాత మళ్లీ టన్నెల్ ప్రధాన అలైన్‌మెంట్‌కు కలిపే విధంగా డిజైన్ చేయాలని భావిస్తున్నారు. ఈ విధానం ద్వారా ప్రమాదకర ప్రాంతాన్ని పూర్తిగా తప్పించుకునే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. SLBC టన్నెల్ మొత్తం పొడవు 43.931 కిలోమీటర్లుగా ఉంది. ఇందులో ఇన్లెట్ వైపు ఇప్పటికే 13.936 కిలోమీటర్లు, ఔట్‌లెట్ వైపు 20.435 కిలోమీటర్లు తవ్వకాలు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఇంకా 9.533 కిలోమీటర్ల టన్నెల్ తవ్వకాలు మిగిలి ఉన్నాయి. ఈ మిగిలిన భాగాన్ని పూర్తి చేయడమే ఇప్పుడు అధికారుల ముందు ఉన్న ప్రధాన సవాల్‌గా మారింది. పనుల పునఃప్రారంభానికి ముందు భద్రతే ప్రధాన ప్రాధాన్యంగా అధికారులు పరిగణిస్తున్నారు. కార్మికుల ప్రాణాలకు ఎలాంటి ముప్పు లేకుండా అత్యాధునిక పరికరాలు, ఆధునిక సాంకేతికతను వినియోగించాలని నిర్ణయించారు. అలాగే నిరంతరంగా భూగర్భ పరిస్థితులను గమనించేందుకు రియల్ టైమ్ మానిటరింగ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రాజెక్టును 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా అధికారులు ముందుకెళున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి పాలమూరు ప్రాంతానికి సాగునీరు, త్రాగునీటి అవసరాలకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలగనుంది. ఎన్నో అడ్డంకులు, ప్రమాదాల మధ్య SLBC టన్నెల్ మళ్లీ ముందుకు సాగుతుండటంతో రైతులు, ప్రజలు ఆశావహంగా ఎదురుచూస్తున్నారు.

## విశాఖ నగరపాలక సంస్థలో పది జోన్లు

విశాఖపట్టణం: మహా విశాఖ నగరపాలక సంస్థ పరిధిలో పునర్వ్యవస్థీకరించిన 10 జోనల్ కార్యాలయాల్లో జనవరి 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. మార్పులకు అనుగుణంగా జోనల్ కార్యాలయాలు, అధికారులు, సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు జోనల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. జీవీఎంసీ పరిధిలో జోనల్ పునర్వ్యవస్థీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసిందని.. అందుకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న 8 జోన్లను 10కి పెంచినట్లు కమిషనర్ పేర్కొన్నారు. జనవరి 1వ తేదీ నుంచి 10 జోనల్ కార్యాలయాలు పనిచేయాలని, అందుకు సంబంధించిన్న ÷ల్స్, రికార్డులు తారుమారు కాకుండా ఒక క్రమ పద్ధతిలో ఆయా జోన్లకు తీసుకువెళ్లాలన్నారు. ఇకపై సిబ్బంది, అధికారులు ఆయా జోనల్ కార్యాలయాల నుంచే విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్లను ఆదేశించారు. ఆయా జోనల్ కార్యాలయాల పరిధిలో ఉన్న వార్డులు, సచివాలయాలు ప్రజలకు తెలిసే విధంగా సచివాలయాల వారీగా

# మహిళలకు రక్షణకు పెద్దపీట

అమరావతి, గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏపీలో క్రైం రేటు బాగా తగ్గిందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. పోలీస్ శాఖ తీసుకున్న నిర్ణయాల వల్ల నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. 2025 సంవత్సరానికి గాను వార్షిక నేర నివేదికను సోమవారం ఏపీ డీజీపీ విడుదల చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. మహిళలకు రక్షణ, మత్తు పదార్థాల రవాణా, సెల్‌ఫోన్ల రికవరీ వంటి అనేక వాటిలో మంచి పురోగతి సాధించామని చెప్పుకొచ్చారు. నిరంతరం సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఈ నేరాలను మరింత తగ్గించేలా నూతన ఏడాదిలో పోలీసులు పని చేస్తారన్నారు. వచ్చే పదేళ్లల్లో పోలీసింగ్ ఎలా ఉంటుందనే దానిపై వర్క్‌షాపు నిర్వహిస్తున్నామని అన్నారు. పోలీసు విధుల్లో వచ్చిన మార్పులు, సాంకేతిక పరిజ్ఞానం, ఎలా అందిపుచ్చుకోవాలో వివరిస్తామని తెలిపారు. సంక్రాంతి పండుగ తర్వాత ఈ వర్క్‌షాపు ఉంటుందని వెల్లడించారు. అలాగే ఇటీవల కీలక కేసులను కూడా ప్రస్తావిస్తూ.. ఎలా చేధించారో వివరిస్తామని తెలిపారు. సరికొత్త పోలీసింగ్ కనిపించేలా ఈ వర్క్‌షాపు ద్వారా అందరికీ తెలియచేస్తామన్నారు. అప్పా ఒక్కటే మనకు పెండింగ్‌లో ఉందని.. దానిపై త్వరలోనే ప్రకటన వస్తుందని తెలిపారు. చట్టానికి అందరూ సమానమే అని.. వ్యక్తిగతంగా వెళ్లేవారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇందులో విజయం, అపజయం ఉండదని.. చట్టాన్ని ఉల్లంఘించి తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలనే తమ విధి అని స్పష్టం చేశారు. సేఫ్ ఏరియా అనుకుని కొంతమంది నక్సలైట్లు ఏపీలోకి వచ్చారని.. కానీ ఎప్పటికప్పుడు తాము నిఘా ఉంచి వారందరినీ పట్టుకున్నామన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి చైనాలో పెద్ద గ్యాంగ్స్ ఉన్నాయని తెలిపారు. మోసం జరిగిన వెంటనే ఆ దేశానికి నగదు వెళ్లిపోతుందని చెప్పారు. అందుకే ఇటువంటి కేసులలో నగదు వాపస్ అనేది చాలా కష్టమైన పని అని తెలియజేశారు. ఇటువంటి మోసాల పట్ల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేంద్రం ఇచ్చిన నివేదిక ప్రకారం 36వ స్థానంలో ఏపీ ఉందనే వార్తలు వాస్తవం కాదని తేల్చిచెప్పారు. అది పాత సిస్టమ్ అని.. మన డేటాకు, వారి డేటాకు మధ్య ఉన్న తేడా వల్ల అలా వచ్చిందన్నారు. అప్పుడు వారి డ్యాష్ బోర్డులో తప్పు ఉందని తాము వారికి లేఖ రాశామని అన్నారు. ఇప్పుడు చూడండి.. డ్యాష్ బోర్డులో ఏపీ ఎక్కడ ఉందో తెలుస్తుందని తెలిపారు.

# తిమ్మాపూర్ మండల సర్పంచుల ఫోరం

కరీంనగర్,తిమ్మాపూర్ మండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాని ఆదివారం మండల సర్పంచుల ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మన్నెంపల్లి సర్పంచ్ పొన్నం సునీత అనిల్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా తాట్ల తిరుపతి, గౌరవ సలహాదారురాలిగా సురం స్వప్న మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా మామిడి మమతా సతీష్, కనకం లక్ష్మి కొమురయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆవుదుర్తి రామకిషన్, కోశాధికారిగా గోదరి శోభారాణి రవి, కార్యదర్శిగా పిస్క సౌజన్య కృష్ణ కిషోర్, దుర్గం శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎలుక ఆంజనేయులు, గుజ్జుల శ్వేత ప్రణీత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఇకపోతే పెద్దపల్లి మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలిగా తలారి స్వప్న-సాగర్ (అందుగులపల్లి) రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం జరిగిన సమావేశంలో మెజారిటీ సభ్యుల ఆమోదం మేరకు ఫోరం కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గుమ్మడి సోని విజయ్ (రాగినేడు), ఉపాధ్యక్షులుగా గున్నాల రాములు (కనగర్తి), కేశవేని అశోక్ యాదవ్ (మూలసాల), గుర్రం శ్రీధర్ (మారేడుగొండ), వంగ అనిల్ (భోజన్నపేట), పాలేటి వెంకటేష్ యాదవ్ (గౌరెడ్డిపేట), ప్రధాన కార్యదర్శులుగా గాజుల ప్రవీణ్ కుమార్ (కాపులపల్లి), కొండ శ్రావణ్ కుమార్ (రంగాపూర్), సిలారపు శ్రీనివాస్ (కొత్తపల్లి), కార్యదర్శులుగా మిట్టపల్లి వెంకటేష్ (పెద్దబొంకూర్) సుద్దాల స్రవంతి వెంకటేష్ (అప్పన్నపేట), బీటి అశోక్ (కుర్మపల్లి), తొగరి రాజేశం (గుర్రాంపల్లి), సంయుక్త కార్యదర్శులుగా పర్స లక్ష్మి-శంకరయ్యయాదవ్ (పెద్దకల్వల), బోయిని ఓదెలు (గోపయ్య పల్లి), కోశాధికారిగా పంబాల రాజు యాదవ్ (బొంపల్లి), సహాయ కార్యదర్శి గా కలవేని అనూష (ముత్తారం), మడుపు జయలక్ష్మి (రాంపల్లి)ని ఎన్నుకున్నారు.

# పాకిస్తాన్‌కు గండం!

ఇస్లామాబాద్:నేను నీతో ఫ్రెండ్ షిప్ చేసినా నీకే డేంజర్. నువ్వు నాతో ఫ్రెండ్ షిప్ చేసినా నీకే డేంజర్ అనే డైలాగ్ ను పాకిస్తాన్ కు నిజం చేసి చూపిస్తున్నారు ట్రంప్. ఆర్మీ చీఫ్ మునీర్‌ను వైట్ హౌస్ కు పిలిచి టీ ఇచ్చి పంపించిన ట్రంప్ ఇప్పుడు ప్రతిఫలంగా హమాస్ పై దాడి చేయమని పాకిస్తాన్ పై ఒత్తిడి చేస్తున్నారు. అలా చేస్తే పాకిస్తాన్ పని అయిపోతుంది. అందుకే మునీర్ అనవసరంగా ట్రంప్ తో స్నేహం చేశానని కంగారు పడుతున్నారు.

గాజాలో శాంతి కోసం పావుగా పాకిస్తాన్

హమాస్-ఇజ్రాయెల్ యుద్ధం తర్వాత గాజాలో శాంతి స్థాపన కోసం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన అంతర్జాతీయ శాంతి దళంలో పాకిస్తాన్‌ను భాగస్వామిని చేసేందుకు అమెరికా గట్టి ప్రయత్నాలు చేస్తోంది. ట్రంప్ తీవ్రంగా ఒత్తిడిచేస్తున్నారు. శాంతిదళం బాధ్యతలలో హమాస్‌ను నిర్వీర్యం చేయడం కూడా ఒకటి. హమాస్‌ను నిరాయుధులను చేయాల్సి ఉంటుంది. ఈ దళంలో ముస్లిం దేశాల సైన్యం ఉంటేనే స్థానిక పాలస్తీనియన్ల నుండి ఆమోదం లభిస్తుందని ట్రంప్ ప్లాన్. అందుకే పాకిస్తాన్ పై గురి పెట్టారు. ఈ కారణంతోనే ఇటీవల పాక్ ను దువ్వుతున్నారు.

ట్రంప్ ఒత్తిడితో పాక్ ఉక్కిరిబిక్కిరి

అమెరికా ప్రతిపాదనపై పాకిస్తాన్ ఆచితూచి స్పందిస్తోంది. అంతర్జాతీయ శాంతి దళంలో భాగం కావడానికి తాము సిద్ధమేనని, అయితే హమాస్ నుంచి ఆయుధాలు లాక్కోలేమని అంటోంది. శాంతి స్థాపన, మానవతా సాయం పంపిణీకి మాత్రమే తమ సైన్యాన్ని పరిమితం చేయాలని పాక్ కోరుతోంది. సుమారు 3,500 మంది సైనికులను పంపే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం ఉన్నప్పటికీ, దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. కానీ ఇలా ఓ సారి గాజాకు పాక్ సైనికులు వెళ్లిన తరవాత అది ముస్లిం సమాజానికి పాక్ చేస్తున్న ద్రోహంగానే ముద్ర పడుతుంది.

ఇస్లామిక్ సంస్థలు తిరుగుబాటు చేసే అవకాశం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన 20 అంశాల శాంతి ప్రణాళికలో భాగంగా పాకిస్తాన్‌కు పెద్ద పీట వేస్తున్నారు. అమెరికా నుంచి ఆర్థిక పెట్టుబడులు, భద్రతాపరమైన సాయం , వాణిజ్య రాయితీలను పొందాలని చూస్తున్న పాకిస్తాన్‌కు ఇది ఒక అరుదైన అవకాశం. పాకిస్తాన్ సైన్యం గాజాకు వెళ్లడం అనేది ఆ దేశంలో రాజకీయంగా పెద్ద ముప్పుగా మారే అవకాశం ఉంది. అమెరికా లేదా ఇజ్రాయెల్ ప్రయోజనాల కోసం పాక్ సైన్యం పనిచేస్తోందనే భావన వస్తే, దేశంలోని ఇస్లామిక్ సంస్థలు, ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత వస్తుందని ప్రభుత్వం

# ప్రజాభీష్టం మేరకే జిల్లాల్లో మార్పులు,చేర్పులు



అమరావతి, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు జిల్లాల ఏర్పాటులో మార్పులు, చేర్పులు చేసినట్లు మంత్రులు తెలిపారు.క్యాబినెట్‌లో 24 అంశాలను చర్చించి ఆమోదం తెలిపినట్లు ఆంధ్రప్రదేశ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలను మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్‌తో కలిసి అనగాని వెల్లడించారు. సాంఘిక సంక్షేమ శాఖలో రుణాలు తీసుకున్న వారికి ఉపశమనం కల్పించామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆమోదించామన్నారు. 9 జిల్లాల్లో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదని.. 17 జిల్లాల్లో కొన్ని మార్పులు చేసినట్లు వెల్లడించారు. ప్రజల కోరిక మేరకు డివిజన్లు, మండలాలు మార్చామన్నారు. గత ప్రభుత్వం సరిగా ఆలోచించకుండా జిల్లాల విభజన చేసిందని విమర్శించారు. గతంలో పారదర్శకంగా చేసుంటే ఈ సమస్యలు వచ్చేవి కావని మంత్రులు నాదెండ్ల, సత్యకుమార్ వ్యాఖ్యానించారు. గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనలు ఉన్నాయి. గ్రేటర్ సిటీలుగా అభివృద్ధి చేస్తామని సీఎం అన్నారు. రాజముద్రతో 21.8 లక్షల పాస్‌బుక్‌లు పంపిణీ చేస్తున్నాం. జనవరి 9లోగా పాస్‌బుక్‌ల పంపిణీ పూర్తి చేస్తాం. తప్పులు సరిచేశాకే పాస్‌బుక్‌లు ఇవ్వాలని ఆదేశించాం. పాస్‌బుక్‌లపై గత పాలకుల ఫొటోలు తొలగించాం. పోలవరం పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. రాయచోటిని మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం హామీ ఇచ్చారు. మంత్రి మండిపల్లిని పిలిచి సీఎం చంద్రబాబు ఓదార్చారు. పరిపాలనా సౌలభ్యం కోసం నిర్ణయాలు తీసుకున్నాం అని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి మార్పుపై మంత్రి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర భావోద్వేగానికి గురవడం చర్చనీయాంశంగా మారింది. వెంటనే రంగంలోకి దిగిన సీఎం చంద్రబాబు మంత్రితో మాట్లాడారు. అలాగే రాయచోటి నియోజకవర్గాన్ని జిల్లా స్థాయి అభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇవ్వడం జరిగింది. రాయచోటి మార్పు వ్యహారంపై మంత్రి రాంప్రసాద్ రెడ్డి చాలా బాధపడుతున్నారని తెలిపారు. అందుకే ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగి మంత్రిమండలి తరవాత కూడా రాంప్రసాద్ రెడ్డిని పిలిచారన్నారు. ఆయన్ను ఓదార్చినట్లు తెలిపారు. రాయచోటిని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని సీఎం చెప్పారని అన్నారు. ఆయనకు మెడికల్ కాలేజీ కావాలా?.. ఇంకేం ఏమన్నా కావాలా అన్న విషయాన్ని ప్రభుత్వం చూస్తుందని తెలిపారు. అలాగే రాంప్రసాద్ రెడ్డి రాజీనామా లాంటి హెస్టీ డెసిషన్‌లాంటివి తీసుకోరన్నారు. ఆయనకు కూడా తమ ప్రాంత అభివృద్ధి ముఖ్యం అని భావిస్తారని మంత్రి స్పష్టం చేశారు. అన్నమయ్య ఎక్కడ జన్మించినా శ్రీవారి సేవలో ఉన్నారని తెలిపారు. అన్నమయ్యకు ప్రాంతాలు ఉండవని... గతంలో కూడా కృష్ణా జిల్లాలో ఎన్టీఆర్ జన్మిస్తే ఎన్టీఆర్ జిల్లా ఏర్పాటు చేసి పెట్టారని మంత్రి అనగాని గుర్తుచేశారు. పరిపాలనా సౌలభ్యం కోసమే రాయచోటి నుంచి మదనపల్లికి మార్చారని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కూటమి కేంద్రం సహకారంతో ప్రభుత్వంలో చేస్తున్న అనేక కార్యక్రమాలను కేబినెట్ చివరన సీఎం తెలిపారన్నారు. అభివృద్ధి, సంక్షమం కింద రాష్ట్ర ప్రజలకు అండగా నిలిచామని.... రూ.50 వేల కోట్లు పెన్షన్ల కింద పంపిణీ చేశామని అన్నారు. సూపర్ సిక్స్ చాలా బాగా సక్సెస్ చేయగలిగామని.... ఆర్థిక ఇబ్బందులున్నా దీన్ని అధిగమించగలిగామని తెలిపారు. ప్రతి గ్రామంలో పల్లె పండుగ తెచ్చి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పంచాయితీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేశారన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పెట్టుబడి గూగుల్ విశాఖకు రావడం ఏపీకి గర్వకారణమన్నారు. గంజాయిపై తాము చేసిన యుద్ధం గురించి కూడా సీఎం కేబినెట్‌లో ప్రస్తావించారని తెలిపారు. రాయలసీమలో తిరుపతిని ఇండస్ట్రియల్ హబ్‌గా, నెల్లూరు పోర్టును ఉపయోగించుకొని 2026లో ముందుకు వెళితే స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా ముందుకు వెళాతామన్నారు. పట్టుదలతో , అంకిత భావంతో బాధ్యతగా పనిచేద్దామని ముఖ్యమంత్రి చెప్పారని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.ఈ ఏడాదిలో ప్రభుత్వపరంగా చాలా కార్యక్రమాలను అమలు చేశాం. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహకారంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలిసి దిగ్విజయంగా చేసిన పనులు గురించి చర్చించాం. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 50 వేల కోట్ల వరకూ ఎన్టీఆర్ భరోసా పేరిట పింఛన్లు అందించాం. సచివాలయాల విషయంలోనూ చాలా మార్పులు చేశాం. ఇప్పటి వరకు రూ. 1200 కోట్లు వెచ్చించి రోడ్లను వేశాం. రూ. 2,500 కోట్లు మంజూరు చేసి రోడ్లను మరమ్మతు చేయిస్తున్నాం. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రతి గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం తీసుకొచ్చారు. విశాఖలో పెద్ద ఎత్తున పెట్టుబడులను సీఎం చంద్రబాబు నాయకత్వంలో తీసుకొచ్చాం. ఐటీ సేవలను మరింత విస్తృతం చేసి అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశాం. పోలీసు శాఖను బలోపేతం చేశాం. గ్రామ, వార్డు సచివాలయాలను స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డుగా మారుస్తున్నాం' అని మనోహర్ తెలిపారు. ఆర్థిక సమస్యలు ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం ముందుకెళ్తున్నాం. గతంలో జరిగిన విధ్వంసకర చర్యలను సరి చేస్తున్నాం. మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించే దిశగా అనేక కార్యక్రమాలు చేపట్టాం. మౌలిక వసతుల కోసం దాదాపు రూ. 3 లక్షల కోట్లను ఖర్చు చేస్తున్నాం. కొప్పర్తి, ఓర్వకల్లుకు పెట్టుబడులు భారీగా వస్తున్నాయి. మచిలీపట్నం నుంచి హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ వరకు రోడ్డు వెళ్తుంది. కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందుతోంది. గత ప్రభుత్వం మాదిరిగా పథకాలకు తమ పేర్లను కాకుండా.. మహనీయుల పేర్లను పెడుతున్నాం. దీనిపైనా మంత్రివర్గం లో చర్చ జరిగిందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రధానంగా విశాఖలో ఆసుపత్రి నిర్మాణానికి భూమి కేటాయింపు, పెనుగొండను వాసవీ పెనుగొండగా మార్చేందుకు ఆమోదం లభించింది. మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం కలిపి జిల్లా ఏర్పాటు చేయనున్నారు.బనగానపల్లె, అద్దరోడ్డును డివిజన్లగా ఏర్పాటు చేస్తారు. చేర్పులు, మార్పులన్నీ జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయి. అన్నమయ్య జిల్లా పేరు అలాగే ఉంటుంది.. జిల్లా కేంద్రం మాత్రం మదనపల్లెకు మారుతుంది. అద్దంకి నియోజకవర్గం బాపట్ల జిల్లా నుంచి ప్రకాశం జిల్లాకు మార్పు చేశారు. ప్రకాశం జిల్లాలో అద్దంకి సబ్‌డివిజన్‌లోనే దర్శి నియోజకవర్గం ఉంటుంది. రాజంపేటను కడప జిల్లాలో, రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలోకి, కడపలోకి సిద్ధవటం, ఒంటిమిట్ట మార్పు చేయగా, ప్రత్యేక రెవెన్యూ డివిజన్‌గా మడకశిరను ఏర్పాటు చేయనున్నారు.

# స్వేచ్ఛ..అంటే అర్ధనగ్న ప్రదర్శన కారాదు

గజ్వేల్,ఇంటి నుండి క్రమశిక్షణ మొదలవుతుంది. బాల్యంలో తల్లి మార్గదర్శి. ఆమె ఏం చెప్పినా పిల్లలు తప్పకుండా పాటిస్తుంటారు. ఆ తర్వాత తండ్రి పాలనలో పిల్లలు ఎన్నో నేర్చుకుం టున్నారు. ఇది మన భారతీయ సంస్కృతి. విద్య, వినయం, వస్త్రధారణ ఇవన్నీ ముందుగా తల్లి ద్వారా పిల్లలు నేర్చుకుంటారు. ముఖ్యంగా పిల్లలు తల్లిని గమనిస్తుంటారు. ఆమె కట్టు బొట్టును ఇష్టపడతారు. ఏమరు పాటులో ఎప్పుడైనా తల్లి ముఖంలో బొట్టు కనబడకపోతే చిన్నారి చేతులతో బొట్టు తెచ్చి పెడతారు. ఇది అందరికీ అనుభవమే. చీర కొంగు కాస్త పక్కకు జరిగితే, ఆ బిడ్డడు ముఖ్యంగా మగ పిల్లవాడు తల్లి కొంగు సరి చేస్తాడు. వాడికి తెలియకుండానే తల్లి బాగుండాలి అని కోరుకుంటాడు. ఇవన్నీ ఏ రాజ్యాంగం లోనూ రాసి ఉండవు. కాలక్రమేణా నేర్చుకుంటున్నాము. అనాదిగా ఆకులు కట్టుకున్న మనిషి మెల్లమెల్లగా వస్త్రాలను ధరించడం ఎలా నేర్చుకున్నాడో ,అలాగే నెమ్మదిగా ఈ తరంలో కొందరు ముందుకు వెళ్లకుండా మళ్లీ ఆదిమానవుడి వైపు వెళ్ళిపోతున్నారు. స్వేచ్ఛ అనేది ఒకరు ఇస్తే వచ్చేది కాదు. మనకి మనం నియంత్రించుకునేది. 'నీ ఇష్టం వచ్చినట్లుగా ఉండు' అని చెప్తే, పరిమితులు దాటి ఉండమని చెప్పడం కాదు. నువ్వు ఎలా ఉండాలో నిర్ణయించుకోవాలి అని అర్థం. నీ శరీరాన్ని నలుగురిలోకి వెళ్ళినప్పుడు ఎలాంటి దుస్తులతో అలంకరించుకోవాలి అనేది ఆలోచించుకోవాలి. నలుగురిలోకి వెళితే నీకు నచ్చిన బట్టలు కాదు కట్టు కోవాల్సింది. ఏ వలువ ధరిస్తే విలువ పెరుగుతుందో అది ఆలోచించు కోవాలి. అలాగని చీరలే కట్టుకోవాలి అనే సిద్ధాంతం ఎక్కడా లేదు. నిండుగా ఉన్న ఏ వస్త్ర ధారణ ఏదైనా స్త్రీకి అందమే! ఇంట్లో తల్లిదండ్రులకు కూడా పిల్లల వస్త్రధారణ గురించి చెప్పే హక్కు లేదు అనడం ఎంతవరకు సబబు? రేపు ఆ పిల్లలు ఏ విధంగానైనా నష్టపోతే తల్లిదండ్రులకే కదా బాధ కలిగేది. ఇలా మాట్లాడిన వాళ్లు వచ్చి రక్షణ కల్పిస్తారా? కొందరు వితండ వాదనలు చేస్తారు. ఎన్నో ఆకృత్యాలు పిల్లలు వృద్ధుల మీద జరుగుతున్నాయి. మరి వాళ్లే దుస్తులు ధరించారని? అని. దానిని ఈ విషయంతో ముడి పెట్టవద్దు. మనిషి మృగంగా మారినప్పుడు అలాంటి ఆకృత్యాలు జరుగుతాయి. సమాజంలో ఉన్నప్పుడు మనిషి లోపల ఉన్న వికృతమైన కోరికను స్పృషించడం ద్వారా తీర్చుకోవాలని ప్రయత్నం చేస్తాడు. నా స్వేచ్ఛ నా ఇష్టం అనేది ఎవరికి వర్తించదు. ఆ స్వేచ్ఛ కావాలనుకుంటే ఇంటి వరకే పరిమిత చేసుకోవాలి. సభ్య సమాజంలో ఉన్నప్పుడు కొన్ని పరిమితులను పాటించాలి. అర్ధనగ్న వస్త్రధారణ చేసుకొని, వారితోపాటు రక్షించే వారిని వెంట తీసుకొని వెళ్లాలట? ఆ వెంట తీసుకెళ్లే రక్షకుల బదులుగా నిండుగా వస్త్రం కప్పుకుంటే ఎంతో మేలు కదా! చిన్న విషయాన్ని అంత పెద్దదిగా ఎందుకు ఆలోచించాలి? విలువైన వస్తువులన్నీ లాకర్లలో పెట్టుకుంటాము. ఇంట్లో భద్రంగా దాచుకుంటాము. కానీ శరీర భాగాలు అంతకన్నా విలువ లేనివా? వాటిని నిర్లజ్జగా ప్రదర్శించడం ఎంతవరకు సమంజసం? ప్రతి ఒక్కరూ న్యాయం వైపు స్పందిస్తారు. అలాగే న్యాయం వైపే స్పందించారు. ఒక మహిళ మరో మహిళను సపోర్టు చేయడానికి ఇష్టపడుతుంది. కానీ పరిమితులు దాటిన మహిళలను ఏ మహిళ సపోర్ట్ చేయడానికి ఇష్టపడదు. మన ఇంట్లో నాన్న ,అన్న, తమ్ముడు, కొడుకు ఎవరికైనా మనకి హితవు చెప్పే హక్కు ఉంది. ఎందుకంటే వారిలో ప్రేమ, ఆప్యాయత తమ వారి రక్షణ బాధ్యత ఇవన్నీ ఉంటాయి. తన వారికి ఏమైపోతుందో అనే ఆందోళన కూడా ఉంటుంది. ఫలానా వారి ఇంటి ఆడపిల్ల అంటే గౌరవంగా చూడాలి అని ఆకాంక్ష కూడా ఉంటుంది. అదంతా తప్పేమీ కాదు. దానిని భూతద్దంలో నుండి చూసి స్పందించాల్సిన అవసరం లేదు. అవును మన వాళ్లు మనకు చెప్పే తీరుతారు. అలాగే సమాజంలో అలాంటి స్థానాన్ని తీసుకొని మంచి చెప్తే అర్థం చేసుకొని ఆచరించి చూపించాలి. అంతేకానీ పంతానికి పోయి మరింత నిర్లజ్జగా వ్యవహరిస్తా మంటే రేపు నష్టపోయేది వారే. రేపటి తరానికి వారు చేయబోయే నష్టం చాలా ఎక్కువ. రేపు వారి పిల్లల దృష్టిలో కూడా చులకన అయిపోతారు. ఇలా ఆలోచిస్తే ఏ మహిళ అసహ్యమైన దుస్తులు వేసుకొని నలుగురులోకి రారు. ఆడవాళ్ళకే ఆంక్షలా? అనే ప్రశ్న వేస్తున్నారు. మరి ఎక్కువగా ఆడవాళ్ళకే నష్టం జరుగుతుంది. ఇంట్లో తల్లిదండ్రులు మగవాళ్ళకి కూడా చెప్పే తీరుగా చెప్తుంటారు. కానీ నలుగురిలో ఒక వస్త్రం జారిపోతే మగవాడు పెద్దగా ఇబ్బంది పడడేమో! మరి అదే స్త్రీ కి ఎలా ఉంటుంది? ప్రాణం పోయినట్లుగా అనిపిస్తుంది. ఇక విషయం మీద మహిళలతో పాటు పురుషులు కూడా మంచిగా స్పందిస్తున్నారు అంటే ఇంకా అర్థం కావడం లేదా? మా స్వేచ్ఛ మాకు ఉండాలి అని అనుకున్నప్పుడు అవతల చూసే వారి కళ్ళు వాళ్ల స్వేచ్ఛ కోరుకుంటాయి! వెనకట ఒక సామెత ఉంది .చింత కాయలకు ఆజ్ఞ కాని, గుటకలకు కాదు కదా అని! అంటే ఒక చెట్టుకు చింతకాయలు ఉంటే అవి కోసుకుంటే మనం ఉల్లంఘన చేసినట్లే. కానీ అవి చూసి నోరూరుతే ఆ తోటమాలికి అవసరం లేదు కదా! ఇది ఈనాటి సామెత కాదు ఏనాటిదో! మన పెద్దలు ఇలాంటివి ఊరికనే చెప్పారా? నీ వస్త్రధారణ చూసి అవతలి వారు గుటకలు వేయడంలో వారి స్వేచ్ఛ అది.. మహిళా వాదులం అంటూ ఇష్టమున్న వ్యాఖ్యలను చేయడం మానుకొని, సమాజానికి ఏది ఉపయోగమో అది చేయండి. ఎంతోమంది మహిళా వాదులు చాలా మంచిగా విషయాలు అర్థం చేసుకుని సమాజానికి వివరిస్తున్నారు. ఇది చాలా మంచి పరిణామం. ఎక్కడ ఆడవాళు గౌరవింప పడతారో అక్కడ దేవతలు పూజింపబడతారు. గౌరవింపబడేలాగా మనం ఉండాలి. అలాగే మగవారి దృష్టి కోణం కూడా మారాలి.

# మరో ముగ్గురు సలహాదారులు నియామకం

అమరావతి,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముగ్గురిని సలహాదారులుగా నియమించింది. ప్రముఖ ప్రకృతి వైద్య రంగ నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజును ఏపీ ప్రభుత్వానికి ప్రకృతి వైద్య సలహాదారుగా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం జీవోను జారీ చేసింది. డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు దశాబ్దాలుగా ప్రకృతి వైద్యం ద్వారా ఎంతో మందికి సేవలు అందించారు. ఉండవల్లి కరకట్టపై ప్రకృతి చికిత్సాలయం పేరుతో ఆసుపత్రి ఏర్పాటు చేశారు. విజయవాడ, నరసాపురంలోనూ ఆరోగ్యాలయం కేంద్రాలున్నాయి. పోచంపల్లి శ్రీధర్‌రావును ప్రభుత్వం సలహాదారుగా నియమించింది. కార్టూనిస్ట్ శ్రీధర్‌గా సుపరిచితులైన ఆయన మాస్ కమ్యూనికేషన్స్‌లో సేవలు అందిస్తారు. దేవదాయ శాఖ సలహాదారుగా చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్ నియమితులయ్యారు.

# జిల్లాల పునర్విభజనకు కేబినేట్ ఆమోదం

అమరావతి, జిల్లాల ఏర్పాటు, పునర్విభజనలపై ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లాల పునర్విభజన ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంత్రివర్గ నిర్ణయంతో కొత్తగా మదనపల్లె, మార్కాపురం, రంపచోడవరం జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. దీంతో రాష్ట్రంలోని జిల్లాల సంఖ్య 28కి పెరగనుంది. దీనికి సంబంధించి తుది గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. అన్నమయ్య జిల్లాలోని రాయచోటిని మదనపల్లె కొత్త జిల్లాకు, రాజంపేటను కడప జిల్లాకు, రైల్వే కోడూరును తిరుపతి జిల్లాకు, గూడూరును తిరుపతి జిల్లా నుంచి నెల్లూరులో కలిపే ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మరోవైపు కొత్తగా 5 రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఏపీ క్యాబినెట్ సమావేశంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి (ఖీజీపూసజీబజీట ఖీ।టటా) కన్నీటి పర్యంతమయ్యారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటి మార్పుపై ప్రతిపాదనలు ఉన్న నేపథ్యంలో ఆయన కన్నీరు పెట్టుకున్నారు. మంత్రి రాంప్రసాద్‌ను సీఎం చంద్రబాబు ఓదార్చారు. జిల్లా కేంద్రం మార్చకుంటే తలెత్తే సాంకేతికపరమైన ఇబ్బందులను మంత్రికి ఆయన వివరించారు. రాయచోటి అభివృద్ధి విషయాన్ని తాను చూసుకుంటానని చంద్రబాబు ఇచ్చారు. రాంప్రసాద్‌రెడ్డి ప్రస్తుతం రాయచోటి నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గతంలో సాంకేతిక అంశాలను పక్కన పెట్టి జిల్లాల పునర్విభజనను గత వైసీపీ ప్రభుత్వం చేపట్టడం వల్ల పలు సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని పరిష్కరించేందుకు చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి మార్పుపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంగా రాయచోటినే ఉంచాలంటూ ఆందోళనలు, నిరసనలకు దిగారు. ముఖ్యంగా ఈ అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి మార్పుపై మంత్రి రాం ప్రసాద్ రెడ్డి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. దాంతో ఈ సమావేశంలో కొద్ది సేపు నిశబ్దం ఆవరించింది. జిల్లా కేంద్రం మార్చకుంటే ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులను మంత్రి రాం ప్రసాద్‌కు సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించారు. రాయచోటి అభివృద్ధిని తాను చూసుకుంటానంటూ మంత్రి రాం ప్రసాద్ రెడ్డికి సీఎ చంద్రబాబు హామీ ఇచ్చారు. అనంతరం అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితోపాటు రాం ప్రసాద్ రెడ్డి కేబినెట్ నుంచి బయటకు వచ్చారు. కానీ మీడియా ప్రతినిధులతో మాట్లాడకుండానే రాం ప్రసాద్ రెడ్డి బయటకు వెళ్లిపోయారు.

# బంగ్లాదేశ్ మారుతుందా?

న్యూఢిల్లీ,ప్రస్తుత ప్రపంచ రాజకీయ, ఆర్థిక రంగాల్లో సంభవిస్తున్న మార్పులు ఒక 'మహా పరివర్తన' వైపు పయనిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా భారత్‌కు వ్యతిరేకంగా 50 శాతం సుంకాలు మరియు వివిధ ఆర్థిక ఆంక్షలు విధించినప్పటికీ, సెప్టెంబర్ 2024 నుండి భారత్ నుండి అమెరికాకు ఎగుమతులు సుమారు 27 శాతం పెరిగాయి.ఇది అంతర్జాతీయ స్థాయిలో భారత్ యొక్క బేరసారాల శక్తిని, అమెరికాకు ఉన్న ఆర్థిక అవసరాలను ఒకేసారి చాటి చెబుతోంది.పాల ఉత్పత్తులు, డేటా భద్రత మరియు వ్యవసాయ విధానాల్లో భారత్ తన స్పష్టమైన విధానాలను (Red Lines) కలిగి ఉంది. వాణిజ్య ఒప్పందాల కోసం తన సార్వభౌమత్వాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేమని న్యూజిలాండ్ మరియు ఒమన్‌లతో కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా భారత్ నిరూపించింది.టెక్నాలజీ యుద్ధం మరియు వీసా ఆంక్షలు: మరోవైపు, సాంకేతిక రంగంలో భారత్ ఆధిపత్యాన్ని దెబ్బతీయడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోంది. హెచ్-1బి (H-1B) వీసా నిబంధనల్లో మార్పులు చేయడం, వీసా పునరుద్ధరణ కోసం భారతీయులను స్వదేశానికి పంపి ఇంటర్వ్యూల కోసం ఏళ్ల తరబడి వేచి ఉండేలా చేయడం వంటివి భారత సేవా రంగాన్ని దెబ్బతీసే కుట్రలో భాగమేనని నిపుణులు భావిస్తున్నారు. ఇది కేవలం పరిపాలనాపరమైన సమస్య కాదు, భారత విదేశీ మారక ద్రవ్య నిల్వలను తగ్గించడానికి మరియు భారత 'బిగ్ టెక్' కలలను అడ్డుకోవడానికి అమెరికా చేస్తున్న వ్యూహం.దక్షిణాసియా ఉక్రెయిన్‌గా బంగ్లాదేశ్: భారత్ చుట్టూ ఒక 'అగ్ని వలయాన్ని' సృష్టించేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా పతనం తర్వాత, మొహమ్మద్ యూనస్ నాయకత్వంలోని ప్రభుత్వం భారత్ భద్రతకు సవాలుగా మారుతోంది. భారత్ అనుకూల సైనిక అధికారులను తొలగించడం, ఉగ్రవాదులను జైళ్ల నుండి విడుదల చేయడం వంటి చర్యలు బంగ్లాదేశ్‌ను 'దక్షిణాసియా ఉక్రెయిన్'గా మార్చే ప్రయత్నమే. అయినప్పటికీ, భారత్ తన సరిహద్దులను బలోపేతం చేస్తూ ఎలాంటి పరిస్థితునైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంది.ఆర్థిక మార్పులు మరియు డాలర్ ఆధిపత్యం: ప్రపంచ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు మునుపెన్నడూ లేని స్థాయికి చేరుకోవడం డాలర్ ఆధిపత్యం ముగిసిపోతోందని సూచిస్తోంది. సంపద పశ్చిమ దేశాల నుండి తూర్పు దేశాలకు మారుతోంది. ఏఐ సాంకేతికత అభివృద్ధి వల్ల సెమీకండక్టర్ చిప్స్ మరియు డి-రామ్ కొరత ఏర్పడి, ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉంది.శామ్సంగ్, గూగుల్ వంటి సంస్థలు వెండి గనులను నేరుగా చేజిక్కించుకోవడానికి ప్రయత్నిస్తుంటే, ఎన్విడియా వంటి సంస్థలు ముందస్తు ఒప్పందాలు చేసుకుంటున్నాయి. అమెరికా టెక్ దిగ్గజాలు తమ గుత్తాధిపత్యాన్ని కాపాడుకోవాలని చూస్తున్నా, రిలయన్స్ మరియు అదానీ వంటి భారతీయ సంస్థలతో 70 బిలియన్ డాలర్ల ఒప్పందాల కోసం అమెరికా కంపెనీలే వెతుక్కుంటూ వస్తున్నాయి.చివరగా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 'డాలర్' ఆధారిత వ్యవస్థ నుండి 'వస్తువులు మరియు ఖనిజాల' ఆధారిత వ్యవస్థగా మారుతోంది. 2026 నాటికి ప్రపంచ రాజకీయాల్లో భారత్ ఒక తిరుగులేని శక్తిగా ఎదగబోతోందని ఈ 'మహా ఆర్థిక మార్పులు' స్పష్టం చేస్తున్నాయి.

## ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా ఎలమంచిలి వద్ద ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌లో మంటలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్లే పలు రైళ్లతో పాటు విశాఖకు రావాల్సిన మరికొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి. విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్లాల్సిన ఉదయ్ ఎక్స్‌ప్రెస్, పూరీ-తిరుపతి, ఈస్ట్‌కోస్ట్, బెంగళూరు హంసఫర్, షాలిమార్-చర్లపల్లి(18045), విశాఖ-లింగంపల్లి (12805), విశాఖ-గుంటూరు (17240) ఎక్స్‌రైళ్లు 3-4 గంటలు ఆలస్యమయ్యాయి. విశాఖకు రావాల్సిన గోదావరి, తిరుపతి-హావ్‌డా కూడా ఆలస్యంగా నడుస్తున్నాయి. ఎలమంచిలిలో ఆగే రైళ్లను అధికారులు వి శాఖలో నియంత్రించి పంపుతున్నారు. ఎలమంచిలిలో స్టాప్ లేని వాటిని యథావి ధిగా పంపిస్తున్నారు. వందేభారత్, జన్మభూమి సూపర్‌ఫాస్ట్ రైళ్లు విశాఖ నుంచి యథావిధిగా బయల్దేరాయి. పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తుండటంతో అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. సింహాద్రి, జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ల కోసం పెద్ద ఎత్తున నిరీక్షిస్తున్నారు. ఎలమంచిలిలో జనరల్ టికెట్లను రైల్వే అధికారులు నిలిపివేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ప్రయాణికులకు సూచించారు. రైలు ప్రమాదం నేపథ్యంలో పలు స్టేషన్లలో హెల్ప్‌లైన్ నంబర్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఏర్పాటు చేశారు. రైళ్ల సమాచారానికి సంబంధించిన వివరాలను కాల్ చేసి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

# షర్మిల రాయలసీమ రాష్ట్ర సమితి ఏర్పాటు చేయబోతోందా ?



అమరావతి,వైఎస్సార్ తనయ వైఎస్ జగన్ చెల్లెలు వైఎస్ షర్మిల. తండ్రి అన్న మాదిరిగానే ఆమె కూడా రాయలసీమ రక్తం. పంతాన్ని పౌరుషాన్ని పుణికి పుచ్చుకున్న వారుగా ఉంటారు. ఆమె పట్టుదలకు ప్రతి రూపం అంటారు, ఓటమిని అంగీకరించని నైజం కూడా ఆమె సొంతం. ఆమె మదిలో రాజకీయాల్లో రాణించాలన్న ఆకాంక్ష బలంగా ఉంది. అయితే అది తొలి మలి ప్రయత్నాలలో ఏ మాత్రం ఫలించలేదు. తన అన్న వైఎస్ జగన్ సీఎం అయ్యాక వైసీపీలో తనకు సముచిత ప్రాధాన్యత దక్కుతుందని ఆమె భావించారు అంటారు అది జరగకపోవడంతో ఆమె 2021లోనే వైసీపీని వీడి బయటకు వచ్చారు. ఆ తరువాత ఆమె 2022లో తెలంగాణాలో వైఎస్సార్ టీపీ అని ఒక కొత్త పార్టీని స్థాపించారు. కాళ్ళు అరిగేలా జనంలో తిరిగారు. భారీ పాదయాత్ర చేశారు. అయితే ఆమె తాను తెలంగాణా కోడలుని అని ఎంత చెప్పినా సెంటిమెంట్ ఎక్కువగా ఉన్న గడ్డ కావడంతో ఆమె ప్రయత్నాలు ఏవీ సక్సెస్ కాలేదని అంటారు.

కట్ చేస్తే కాంగ్రెస్ :

ఇక తమ సొంత పార్టీ ఆశలను ఆమె వదులుకుని కాంగ్రెస్ లో ఆ పార్టీని 2023 డిసెంబర్ లో విలీనం చేశారు. ఆ తరువాత 2024 జనవరిలో పీసీసీ చీఫ్ గా నియమితులయ్యారు. ఆమె పీసీసీ సారధిగా తనకూ కాంగ్రెస్ పార్టీకి ఒక భారీ పొలిటికల్ గ్రాఫ్ వస్తుందని ఆశించి ఆ పార్టీ జెండాను ఎత్తుకున్నారు పైగా వైఎస్సార్ బ్లడ్ కాబట్టి కచ్చితంగా క్లిక్ అవుతుందని కూడా ఊహించారు. కానీ తన అన్న జగన్ ని మాజీ సీఎం గా చేయడంతో ఎంతో కొంత తన వంతు పాత్ర పోషించ గలిగారు తప్పించి తాను మాత్రం అనుకున్న విధంగా రాణించలేకపోయారు. ఇక రెండేళ్ళ కాంగ్రెస్ పార్టీ పీసీసీ ప్రస్థానంలో ఆమె సాధించినది కూడా ఏమీ లేదు అని అంటున్నారు. కాంగ్రెస్ కూడా జాతీయ స్థాయిలో ఎత్తిగిల్లింది కూడా లేదు అని చెబుతున్నారు. దాంతో ఆ పార్టీలో ఎన్నాళ్ళు ఉన్న జరిగేది ఒరిగేది ఏమీ లేదని ఆమె ఒక డెసిషన్ కి వచ్చారని ప్రచారం అయితే ఉంది.

కొత్త ప్రయోగంతో :

ఇక రాయలసీమలో బలమైన సామాజిక వర్గంగా రెడ్లు ఉన్నారు. గ్రేటర్ రాయలసీమగా చెప్పుకునే ఆరు జిల్లాలలో వారి ప్రభావం విశేషంగా ఉంటుంది. కడప కర్నూలు, అనంతపురం, చిత్తూరు, ప్రకాశం, నెల్లూరులలో రెడ్ల రాజకీయంతోనే కథ అంతా సాగుతుంది. దాంతో తెలంగాణా రాష్ట్ర సమితి మాదిరిగా రాయలసీమ రాష్ట్ర సమితిని కనుక స్థాపిస్తే కచ్చితంగా ఈ ఆరు జిల్లాలలో ప్రభావం చూపించవచ్చు అన్నది ఆమె ఆలోచనగా ఉంది అని ప్రచారం అయితే పెద్ద ఎత్తున సాగుతోంది. ఇక వైసీపీకి కూడా గ్రేటర్ రాయలసీమ హార్డ్ కోర్ రీజియన్ గా ఉంది అని అంటున్నారు మరి జగన్ కి పట్టున్న ఈ ప్రాంతాంలో షర్మిల కనుక కొత్త పార్టీ అంటూ ముందుకు వస్తే మొదటి దెబ్బ పడేది అన్నకే అని అంటున్నారు.

వైసీపీకి భారీ షాక్ :

వైసీపీకి 2024 లో ఓటమి సంభవిస్తే అది కూటమి వల్ల కావచ్చు కానీ భారీ ఓటమి అంటే కనీసం 18 అసెంబ్లీ సీట్లు కూడా దక్కకుండా కేవలం 11 సీట్లకే పరిమితం అవడం వెనక షర్మిల ప్రభావం రాయలసీమలో బలంగా పనిచేయబట్టే అని కూడా విశ్లేషణలు ఉన్నాయి. లేకపోతే కడప వంటి కంచుకోటలో పది సీట్లులో టీడీపీ కూటమికి ఆరు దక్కి వైసీపీకి నాలుగు సీట్లు రావడం అంటే కాంగ్రెస్ పార్టీ తరఫున షర్మిల ఎదురు నిలిచి వైసీపీ మీద గురి పెట్టడమే కారణం అని అంతా అనుకున్నారు. ఇపుడు కూడా చూస్తే షర్మిల సొంత పార్టీతో కనుక రంగ ప్రవేశం చేస్తే అది కచ్చితంగా వైసీపీకే భారీ షాక్ ఇస్తుందని అంటున్నారు. ఒక విధంగా వైసీపీ ఓట్లు చీలి మరోసారి కూటమికే విజయావకాశాలు ఉంటాయని కూడా అంటున్నారు. మరి షర్మిల రాయలసీమ రాష్ట్ర సమితి పేరుతో కొత్త పార్టీ పెడతారా నిజంగా అది గాసిప్ నా అన్నది తెలియాలి అంటే కొన్నాళ్ళ పాటు వేచి చూడాల్సిందే అని అంటున్నారు. సో ప్రస్తుతం ఈ గాసిప్ మాత్రం తెగ వైరల్ అవుతోంది.

# హెచ్-1 వీసాలపై కక్ష సాధింపు ధోరణి




న్యూఢిల్లీ,వీసా కష్టాలు ఇప్పట్లో తీరేలా లేవు. భారత విదేశాంగశాఖ అమెరికాతో సంప్రదింపులు జరిపినట్లు విదేశాంగశాఖ ప్రతినిధి తెలిపారు. అయితే ఇదంతా కేవలం భారత్ పట్ల ట్రంప్ అనుసరిస్తున్న వ్యతిరేక వైఖరిగానే గుర్తించాలి. ప్రజలు ఇబ్బంది పడుతున్నా, టెక్ కంపెనీలు సూచించినా ట్రంప్ వైఖరిలో మార్పు రాలేదు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత భారత్‌కు భారీ స్థాయిలో నష్టం వాటిల్లింది. ఇప్పటి వరకు ఆయన తీసుకున్న నిర్ణయాలు అన్ని రకాలుగా భారత్‌ను కష్టాల్లో పడేశాయి. హెచ్ 1 బీ వీసాల పీజు భారీగా పెంచేశారు. హెచ్ 1బీ వీసా ఫీజులను ఏడాదికి 1,00,000 డాలర్లు వరకు పెంచారు. హెచ్ 1బీ వీసాల రుసుము పెంచిన కొన్ని రోజులకు మరో దారుణమైన నిర్ణయం తీసుకున్నారు. విదేశీ చిత్రాలపై ఏకంగా 100 శాతం టారీఫ్‌లు విధించారు. అమెరికాలో భారతీయ సినిమాలకు మంచి ఆదరణ ఉంటుంది. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయంతో భారత చిత్ర పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడింది. ఇంతటితో ట్రంప్ కక్ష సాధింపు చర్యలు ఆగలేదు. భారత్‌నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే బియ్యంపై 50 శాతం టారీఫ్‌లు విధించారు. ఒకరకంగా చెప్పాలంటే 2025లో భారత్, అమెరికాల మధ్య సంబంధం టారీఫ్‌ల వివాదంతోటే గడిచిపోయింది. అవకాశం ఉన్న ప్రతీ దానిపై ట్రంప్ టారీఫ్‌లు వేసేశారు. తమ దేశంతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోలేదన్న కోపంతో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. వాణిజ్య ఒప్పందాలు చేసుకోలేదన్న కారణంతో ఆగస్టు నెలలో భారత్‌పై ఏకంగా 50 శాతం టారీఫ్‌లు వేశారు. రెండు దేశాల మధ్య చర్చలు జరిగినా ఫలితం లేకుండా పోయింది. రష్యాతో ఇండియా ఆయిల్ కొనుగోలు చేయటం ఇష్టం లేని ట్రంప్ బెదిరింపులకు దిగారు. రష్యాతో వ్యాపారం మానుకోకపోతే మరిన్ని టారీఫ్‌లు వేస్తామని హెచ్చరింరు. ఇలాంటి సమయంలో గత ఆగస్టు నెలలో ప్రధాని మోదీ చైనా పర్యటనకు వెళ్లారు. అక్కడ మోదీ, పుతిన్, జిన్ పింగ్ కలిశారు. పలు ఒప్పందాలు చేసుకున్నారు. ఈ ముగ్గురూ కలవటంపై ట్రంప్ తన సోషల్ మీడియా ఖాతాలో సెప్టెంబర్ 5వ తేదీన క్రిప్టిక్ మెసేజ్ పెట్టారు. డిసెంబర్ 8వ తేదీన అధ్యక్షుడు ట్రంప్ వైట్ హౌస్‌లో మాట్లాడుతూ అమెరికాలోని రైతులకోసం మల్టీ బిలియన్ డాలర్ రిలీఫ్ ప్యాకేజ్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా భారత్, ఇతర ఆసియా దేశాలనుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న వ్యవసాయ ఉత్పత్తులపై విమర్శలు సైతం గుప్పించారు. ఇతర దేశాలనుంచి వస్తువుల్ని అమెరికాలోకి దిగుమతి చేసుకోవటం స్థానిక ఉత్పత్తిదారులకు సవాలుగా మారిందని అన్నారు. స్థానిక ఉత్పత్తిదారులను రక్షించటం కోసం, దిగుమతులకు అడ్డుకట్ట వేయటం కోసం భారీ మొత్తంలో టారీఫ్‌లు వేస్తామని స్పష్టం చేశారు. ఆయన మాట్లాడుతూ.. 'రైతులు ఎంతో అవసరమైన జాతీయ ఆస్థి. అమెరికాకు వెన్నెముక లాంటి వారని అన్నారు. రష్యా, చైనాలను తమ దారిలోకి తెచ్చుకోవడానికి భారత్‌ను అమెరికా పావుగా వాడుకుంటోందని అమెరికాకు చెందిన రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ట్రంప్ తీసుకునే నిర్ణయాల వల్ల అమెరికాకు లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉందని అంటున్నారు. ఇది ఇలాగే కొనసాగితే రాబోయే సంబంధాలు మరింత దారుణంగా దెబ్బతింటాయని హెచ్చరిస్తున్నారు. అయితే, రెండు దేశాల మధ్య భవిష్యత్ వాషింగ్టన్, ఢిల్లీ తీసుకునే నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు. 2026లో అయినా రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడతాయని అమెరికన్లు కూడా ఆశగా ఉన్నారు. ముఖ్యంగా వీసా వ్యవహారాలపై సరైన నిర్యం తీసుకోకుంటే తక్షణ ఇబ్బందులు తప్పేలా లేవు.

# ఆధిపత్య కుల రాజకీయాల పునర్వ్యవస్థాపన

హైదరాబాద్,గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వార్డులను 150 నుంచి 300కు పెంచుతున్నామని ప్రభుత్వం ప్రకటించిన తీరు– పైకి ప్రజాస్వామ్య విస్తరణగా కనిపించినా, లోతుగా చూస్తే అది రాజకీయ అధికారాన్ని తిరిగి పంచుకునే కుట్రాత్మక వ్యాయామంలా కనిపిస్తోంది. ఇది పరిపాలనా సంస్కరణ కాదు. ఇది అధిపత్య కుల రాజకీయాలకు కొత్త మ్యాప్ గీసే ప్రయత్నం.వార్డు విభజన అనేది సంఖ్యల ఆట కాదు. అది ఎవరు గెలవాలి, ఎవరు ఓడిపోవాలి, ఎవరు రాజకీయంగా ఎదగాలి, ఎవరు శాశ్వతంగా పక్కకు నెట్టబడాలన్నది నిర్ణయించే ప్రమాదకర ఆయుధం. అలాంటి ఆయుధాన్ని శాస్త్రీయ ప్రమాణాలు, జనాభా నిష్పత్తి, సామాజిక న్యాయం పక్కనబెట్టి వాడితే అది ప్రజాస్వామ్యంపై నేరమే.ప్రస్తుతం జరుగుతున్న విభజనపై కార్పొరేషన్ సమావేశాల్లో వెల్లువెత్తుతున్న ఆవేదన యాదృచ్ఛికం కాదు. ఇది దళిత–బహుజన వర్గాల్లో, ముఖ్యంగా మూడో తరం రాజకీయ నాయకత్వం ఎదగకుండా అడ్డుకునే వ్యూహంపై కలిగిన న్యాయమైన భయం. రెడ్డి, వెలమ, ఆంధ్ర సెటిలర్లుగా గుర్తింపుపొందిన కమ్మ, కాపు కులాలకు రాజకీయ అధికారాన్ని కట్టబెట్టేలా గీతలు గీస్తున్నారన్న అనుమానం బలంగా ఉంది– ఇది ఊహ కాదు, గత అనుభవాల నుంచి వచ్చిన అనుమానం.

రిజర్వేషన్లు– కాగితాల్లో న్యాయం, గీతల్లో ద్రోహం

300 వార్డుల విభజనలో రిజర్వేషన్ల ప్రశ్న అత్యంత కీలకమైనది. కానీ ఇక్కడే ప్రభుత్వ అసలు ముఖం బయటపడే ప్రమాదం ఉంది. ఎస్సీ, ఎస్టీలకు 22.5 శాతం రిజర్వేషన్లను యాంత్రికంగా కొనసాగిస్తూ, బీసీలకు మాత్రం జనాభాకు అసమానంగా 23 శాతం వరకే పరిమితం చేసిన చరిత్ర మన ముందుంది. ఇది న్యాయం కాదు, ఇది రాజకీయ లెక్క.అదే సమయంలో ముస్లింలకు కేటాయించిన సీట్లను బీసీ కోటాలో చూపించడం ద్వారా వాస్తవానికి బీసీలకు నష్టం జరిగింది. మైనార్టీలకు వారి జనాభాకు తగిన ప్రాతినిధ్యం దక్కింది– కానీ ఇది అసలు విషయం కాదు. దీనికి మూల్యం చెల్లించింది బీసీలు. ఈ అసమానతను సరిచేయకుండా, ఇప్పుడు కొత్త వార్డుల పేరుతో అదే ద్రోహాన్ని మళ్ళీ పునరావృతం చేయబోతున్నారానే సందేహం కలుగుతుంది.వార్డు విభజన తర్వాత రెడ్డి, వెలమ, కమ్మ, కాపు కులాలకు ఇవ్వాల్సినదానికంటే ఎక్కువే దక్కే అవకాశం ఉందన్న అంచనా రాజకీయ వాస్తవాల మీద ఆధారపడినది. కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ ప్రాతినిధ్యం అంటూ చేసిన బోగస్ హామీలు చివరకు 17.5 శాతానికే కుదిరిపోయిన ద్రోహ చరిత్ర ఇప్పటికీ బహిరంగమే. అదే స్క్రిప్ట్ జీహెచ్ఎంసీలో తిరిగి రాయబడితే– బీసీల రాజకీయ భవిష్యత్తుకు అది ఘోర ప్రమాదం.

జనరల్ సీట్లు గెలిచినా ప్రమాదం తొలగలేదు




ఇప్పటివరకు బీసీలు జనరల్ స్థానాల్లో పోటీ చేసి– ఇది పూర్తి స్థాయిలో కాదు కానీ గెలవగలిగారు. అది వారి సామాజిక శక్తికి నిదర్శనం. కానీ ఆ అవకాశాలనే వ్యవస్థాపకంగా మూసివేయాలనే ప్రయత్నమే ఈ వార్డు విభజన. "మీరు గెలుస్తున్నారు కదా, రిజర్వేషన్లు ఎందుకు?" అన్న వాదన వెనుక దాగిన ఉద్దేశం ఇదే. పోటీని నియంత్రించడం, గెలుపును పరిమితం చేయడం. ఈ పరిస్థితిలో "ఇప్పుడేమీ జరగదు" అన్న నిర్లక్ష్యం బీసీలకు ప్రాణాంతకం. రాజకీయంగా అప్రమత్తంగా లేకపోతే, ఈ నగరంలో బీసీలు ఓటర్లుగానే మిగిలిపోతారు, నాయకులుగా కాదు.

మాటలకే పరిమితం కాకుండా ఉద్యమం తప్పనిసరి

కాబట్టి బీసీలు ఇక ప్రెస్‌మీట్‌లకే, ఇందిరాపార్క్ ధర్నాలకే పరిమితం కావడం సరిపోదు. 300 వార్డుల్లో కనీసం సగం సీట్లకు న్యాయమైన ప్రాతినిధ్యం కోసం ఉద్యమించాలి. అది వార్డు స్థాయిలో జరగాలి. ప్రతి గీతను ప్రశ్నించాలి. ప్రతి మ్యాప్‌ను బహిర్గతం చేయాలి. ఈ రోజు ఆ వార్డులలో అన్యాయం జరిగిందని రాజకీయ పార్టీలు ఎలా రోడ్డెక్కాయో అదే తీవ్రతతో, అదే పట్టుదలతో బీసీలు తమ హక్కుల కోసం నిలదీయాలి. ఎందుకంటే ఇది సీట్ల పోరు కాదు, ఇది రాజకీయ ఉనికికి సంబంధించిన పోరు ఆయా పార్టీలలో ఉన్న బీసీల కర్తవ్యం కూడ.

ప్రజాస్వామ్యమా? లేక ఆధిపత్యపు పునర్వ్యవస్థాపనా?

ఈ వార్డు విభజన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందా? లేదా ఆధిపత్య కులాల అధికారాన్ని మరోసారి పునర్వ్యవస్థాపన చేస్తుందా? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందే. కానీ అంతకంటే ముందు ప్రజలు, ముఖ్యంగా బీసీలు, ఈ దగుల్బాజీని గుర్తించి అప్రమత్తంగా నిలబడాల్సిందే. ఎందుకంటే, మౌనం ఎప్పుడూ తటస్థం కాదు. ఇలాంటి వేళ మౌనం కూడా ద్రోహమే.

# బోగస్ ఏజెంట్ల మోసంలో పడవద్దు




హైదరాబాద్, బోగస్ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ప్రవాసుల సమస్యలు వినేందుకు ప్రజాభవన్‌లో ప్రవాసీ ప్రజావాణి కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. గల్ఫ్ వెళ్లే కార్మికుల సమస్యలనూ పరిష్కరిస్తున్నామని చెప్పారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా గల్ఫ్‌లో ఉన్న తెలంగాణ ప్రజల ఇబ్బందులను పలువురు సభ్యులు ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా.. మంత్రి పొన్నం స్పందించారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ద్వారా విదేశాల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో నైపుణ్యాలను బట్టి ఉపాధి అవకాశాలు వస్తున్నాయన్నారు. టామ్ కామ్ ద్వారా మాత్రమే విదేశాలకు వెళ్లాలని సూచించిన ఆయన.. ఇందులో శిక్షణ తీసుకొని ఇతర దేశాల్లో ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని నిరుద్యోగ యువతకు విజ్ఞప్తి చేశారు. నైపుణ్యం కలిగిన యువతకు గల్ఫ్‌తో పాటు ఇతర దేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టామ్‌కామ్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గల్ఫ్ బాధితుల కోసం తెలంగాణలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఉంటే బావుంటుందని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సూచించారు. అక్కడ కార్మికులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. శాసనసభ జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. మన ఊరు–మన బడికి నిధులు రావడం లేదన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ఇప్పటివరకు నెరవేర్చలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. జీహెచ్ఎంసీ పునర్విభజనలో కొన్ని డివిజన్లలో ఓటర్ల శాతంలో హెచ్చుతగ్గులు ఉన్నాయని.. వాటిపై ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలన్నారు.

## సింగరేణి కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి: కూనంనేని

హైదరాబాద్, సింగరేణి కార్మికుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శాసనసభ జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. 'సింగరేణి పెద్ద పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్. పూర్తిగా ప్రైవేటుపరం అయ్యే అవకాశం కనిపిస్తోంది. సింగరేణి కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

# ముక్కోటి ఏకాదశి అత్యంత పవిత్రం



తిరుమల,ఏడాదికి 24 ఏకాదశులు వస్తాయి. సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశి అంటారు. సూర్యుడు ధనుస్సులో ప్రవేశించిన అనంతరం మకర సంక్రమణం వరకు జరిగే 'మార్గం' మధ్య ముక్కోటి ఏకాదశి వస్తుంది. ఈ రోజున వైకుంఠ వాకిళ్లు తెరుచుకొని ఉంటాయని వైష్ణవాలయాలలో గల ఉత్తర ద్వారం దగ్గర భక్తులు తెల్లవారుజామునే భగవద్దర్శనార్థం వేచి ఉంటారు. ఈ రోజు మహావిష్ణువు గరుడ వాహనారూఢుడై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనమిస్తాడు కనుక దీనికి ముక్కోటి ఏకాదశి అనే పేరు వచ్చిందంటారు. ఈ ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏకాదశులతో సమమైన పవిత్రతను సంతరించుకున్నందువల్ల దీన్ని ముక్కోటి ఏకాదశి అంటారని కూడా చెబుతారు. ముక్కోటి ఏకాదశి నాడే హాలాహలం, అమృతం రెండూ పుట్టాయి. ఈ రోజునే శివుడు హాలాహలం మింగాడు. మహాభారత యుద్ధంలో భగవద్గీతను కృష్ణుడు అర్జునునికి ఇదే రోజున ఉపదేశించాడని విశ్వాసం ఉంది. ఈ రోజున వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, ప్రవచనాలు, ప్రసంగాలు ఉంటాయి. ఈ రోజున ముఖ్యమైనవి ఉపవాసం, జాగరణ. అటు తర్వాత జపం, ధ్యానం. విష్ణుపురాణం ప్రకారం ఇద్దరు రాక్షసులు తనకు వ్యతిరేకంగా ఉన్నా మహావిష్ణువు వారి కోసం తన వైకుంఠ ద్వారాలను తెరిచాడనీ, తమ కథ విని, వైకుంఠ ద్వారం గుండా వస్తున్న విష్ణు స్వరూపాన్ని చూసిన వారికి వైకుంఠం ప్రవేశం కల్పించాలనీ వారు కోరారు. అందుచేతనే ఆ రోజును వైకుంఠ ద్వారాన్ని తలపించే విధంగా వైష్ణవ ఆలయాల్లో ద్వారాలను ఏర్పాటు చేస్తారు. మామూలు రోజుల్లో దేవాలయాల ఉత్తర ద్వారాలు మూసి ఉంచుతారు. కానీ ఈ రోజు భక్తులు ఆ ఉత్తరద్వారం గుండా వెళ్ళి దర్శనం చేసుకొంటారు. తిరుపతిలో కూడా ఈ రోజును వైకుంఠద్వారం పేరిట ఉన్న ప్రత్యేక ద్వారాన్ని తెరిచి ఉంచుతారు. పద్మ పురాణం ప్రకారం విష్ణువునుంచి ఉద్భవించిన శక్తి ముర అనే రాక్షసుడిని సంహరించిన రోజు వైకుంఠ ఏకాదశి. ముర అనే రాక్షసుడి దురాగతాలు భరించలేక దేవతలు విష్ణువు శరణువేడగా ఆయన వాడితో తలపడి వాడిని సంహరించేందుకు ప్రత్యేక అస్త్రం కావాలని గ్రహించి బదరికాశ్రమంలోని హైమావతి గుహలోకి ప్రవేశించాడు. అక్కడ విశ్రమిస్తున్న విష్ణువును ముర సంహరించేందుకు ప్రయత్నించగా ఆయన నుంచి ఒక శక్తి ఉద్భవించి తన కంటి చూపుతో మురను కాల్చి వేసింది. అప్పుడు విష్ణువు సంతసించి ఆమెకు ఏకాదశి అని పేరు పెట్టి వరం కోరుకోమని చెప్పాడు. ఆ రోజున ఉపవాసం ఉన్న వారి పాపాలను పరిహరించాలని ఆమె కోరింది. ధనుర్మాస శుక్ల ఏకాదశి రోజున ఉపవాసం ఉన్న వారికి వైకుంఠప్రాప్తి కలుగుతుందని విష్ణువు వరమిచ్చాడు. వైకుంఠ ఏకాదశి రోజు ముర బియ్యంలో దాక్కుంటాడని, అందుకే బియ్యంతో చేసిన ఏ పదార్థం తినకుండా ఉండాలని అంటారు. ఈ రోజున ఉపవాసం ఉంటే మిగతా 23 ఏకాదశులు ఉపవాసం ఉన్నట్టే అని విష్ణుపురాణం చెబుతోంది. ముర అంటే తామసిక, రాజసిక గుణాలకు, అరిషడ్వర్గాలకు ప్రతీక. వీటిని ఉపవాస జాగరణల ద్వారా జయిస్తే సత్వ గుణం లభించి తద్వారా ముక్తికి మార్గం ఏర్పడుతుంది. వరి అన్నంలో ముర నివాసం ఉంటాడు కనుక మందబుద్ధిని ఇచ్చిని జాగురూకతను దెబ్బతీస్తాడని అంతరార్థం. ఏకాదశినాడు ఉపవాసం ఉండి, ద్వాదశినాడు అన్న దానం చేస్తారు. ఒకరోజు భోజనం చేయక తరువాతి రోజు చేయడం వలన జిహ్వాకు భోజనం రుచి తెలుస్తుంది. గీతోపదేశం జరిగిన రోజు కనుక 'భగవద్గీత' పుస్తకదానం చేస్తారు.

# హసీనా ప్రత్యర్థి.. భారత్ ద్వేషి.. బంగ్లా బేగం ఖలీదా కన్నుమూత



ఢాకా,పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో ఒక శకం ముగిసింది. అంతర్గత సమస్యలు, అశాంతితో అట్టుడుకుతున్న ఆ దేశంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇప్పటికే మాజీ ప్రధాని, అవామీ లీగ్ పార్టీ అధినేత్రి షేక్ హసీనా తప్పనిసరి పరిస్థితుల్లో వచ్చేసి భారత్ లో ఆశ్రయం పొందుతున్నారు. బంగ్లాదేశ్ లో మరో పార్టీ అయిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ) చీఫ్, మాజీ ప్రధాని బేగం ఖలీదా జియా (80) కన్నుమూశారు. షేక్ హసీనాకు చిరకాల ప్రత్యర్థి అయిన ఖలీదా జియా చాలాకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఉమ్మడి భారత దేశంలో 1945 ఆగస్టు 15న పుట్టిన ఈమె... 1991-96, 2001-06 మధ్య పదేళ్లు ఆ దేశ ప్రధానిగా పనిచేశారు. 2006 నుంచి బంగ్లా ప్రతిపక్ష నేతగానూ ఉన్నారు. షేక్ హసీనా 2006లో ప్రధాని అయ్యాక.. ఖలీదా జియాపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే 2018-20 మధ్య జైలులో పెట్టారు. బంగ్లాలో కేర్ టేకర్ గవర్నమెంట్ ను ప్రవేశపెట్టింది ఈమెనే కావడం గమనార్హం. కాగా, వయసు రీత్యా అనారోగ్య సమస్యలు చుట్టిముట్టిన ఖలీదాను గత నెల 23న ఆస్పత్రిలో చేర్చారు. గుండె, ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ తో బాధపడుతుండగా.. న్యుమోనియా కూడా సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. డయాబెటిస్ కు తోడు కిడ్నీ, లివర్, లంగ్స్ పనితీరు దెబ్బతిన్నది. అప్పటినుంచి ఆస్పత్రిలోనే ఉన్న ఖలీదా మంగళవారం తుదిశ్వాస విడిచారు.

వ్యాపార కుటుంబం నుంచి..

ఖలీదా తండ్రి సికిందర్. వీరిది వ్యాపార కుటుంబం. బంగ్లా విమోచన యుద్ధంలో పాల్గొన్న జియాఉర్ రెహ్మాన్ ను 1960లోపెళ్లాడారు ఖలీదా. అప్పటి పాకిస్థాన్ పాలకులపై తిరుగుబాటు చేసిన జియాఉర్.. 1981లో హత్యకు గురయ్యారు. దీంతో బీఎన్పీ చీఫ్ గా ఖలీదా బాధ్యతలు చేపట్టారు. కాగా, ఖలీదా కుమారుడు తారిఖ్ రెహ్మాన్ ఇటీవల స్వదేశానికి చేరుకున్న సంగతి తెలిసిందే. 17 ఏళ్ల కిందట దేశాన్ని వీడిన ఆయన తల్లి అనారోగ్యం రీత్యా బంగ్లాకు తిరిగొచ్చారు. రెండు సీట్ల నుంచి పోటీచేస్తున్నారు. ఖలీదాకు మరో కుమారుడు అరాఫత్ రెహ్మాన్ ఉన్నారు. ఆయన గతంలో మలేసియాలో చనిపోయారు.

హసీనాకు బద్ధ విరోధి.. భారత్ ద్వేషి

రెండు పెద్ద పార్టీలకు మహిళలే అధిపతులు ఉండడం బంగ్లాదేశ్ ప్రత్యేకత. అయితే, ఖలీదా జియా.. షేక్ హసీనా 40 ఏళ్లకు పైగా బంగ్లా రాజకీయాల్లో పరస్పర ప్రత్యర్థులు. అంతేకాదు.. భారత్ అంటే ఖలీదా ఇష్టం చూపేవారు కాదు. బద్ధ విరోధులైన వీరిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. అధికారంలో ఉండగా పరస్పరం ఇబ్బందులు పెట్టుకున్న చరిత్ర ఉంది. ఈ క్రమంలోనే 2018లో ఖలీదాను హసీనా జెల్లో పెట్టారు. ఇప్పుడు ఆమె మరణంతో బంగ్లా రాజకీయాల్లో ఒక శకం ముగిసింది.

## ప్రేమ విఫలం కావడంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

అనకాపల్లి,అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలానికి చెందిన ఇంటర్ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. తాను ఓ యువకుడిని ప్రేమిస్తున్నానని, అతను లేకుండా జీవించలేనని సూసైడ్ నోట్ రాసి ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తాను మరో యువకుడిని ప్రేమిస్తున్నానని అనుకొని మొదట ప్రేమించిన వ్యక్తి మాట్లాడటం లేదని, తన తల్లిదండ్రులకు చెడ్డ పేరు రాకూడదనే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖలో ఆమె పేర్కొంది. ఇదిలా ఉంటే పుస్తకాలు కొనుక్కోవడానికి వెళ్లిన తన కుమార్తె ఓ యువకుడితో గొడవ పడటం గమనించామని, ఈ కారణంతోనే ఆత్మహత్య చేసుకుందని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పంచనామా చేసి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com